# ప్రజా తపన

prajathapana.com

News that matters




పవిత్రత లోపించిన ఆలోచన, అపవిత్రమైన కార్యంతో సమానమైనదే. కోరికల్ని అదుపు చేస్తే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవచ్చు. లైంగిక శక్తిని ఆధ్యాత్మిక మార్గంలోకి మరల్చండి.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 49 మంగళవారం 04 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# నీతికి ,న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఐ

**ప్రజా తపన ,న్యూఢిల్లీ**



ప్రజాస్వామ్యానికి, న్యాయానికి అవినీతి అతిపెద్ద ఆటంకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అవినీతి బారి నుంచి దేశాన్ని విముక్తి చేయడం సీబీఐ కీలక బాధ్యత అని సూచించారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) వజ్రోత్సవ వేడుకలను ప్రధాని సోమవారం ప్రారంభించారు. షిల్లాంగ్, పూణే, నాగ్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన సీబీఐ కార్యాలయ సముదాయాలను ఆయన ప్రారంభించారు. కేంద్ర దర్యాప్తు సంస్థ ట్విట్టర్ ఖాతాను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. సీబీఐని న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా అభివర్ణించారు.
సీబీఐ వజ్రోత్సవ వేడుకల్లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. సీబీఐ తన పనితనం, సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు విశ్వాసం కల్పించిందని తెలిపారు. నేటికీ, ఒక కేసు అపరిష్కృతంగా ఉన్నప్పుడు, దానిని సీబీఐ అప్పగించాలని డిమాండ్లు వినిపిస్తాయని గుర్తుచేశారు. వృత్తిపరమైన, సమర్థవంతమైన సంస్థలు లేకుండా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడం సాధ్యం కాదని.. ఈ క్రమంలో సీబీఐపై గురుతర బాధ్యత ఉందని మోదీ స్పష్టంచేశారు. సీబీఐ ఒక బహుముఖమైన, బహుళ విభాగాల దర్యాప్తు సంస్థగా తన ఇమేజ్‌ను నిర్మించుకుందని ప్రధాని ప్రశంసించారు. బ్యాంకు

(మిగతా 2లో)



# ముందస్తు ఎన్నికలు లేవు

**ప్రజా తపన :అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందన్న వార్తలపై సీఎం జగన్ రెడ్డి కుండబద్ధలు కొట్టారు. ముందస్తు ఎన్నికలు లేవని ఏపీ ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. ఎన్నికలకు ఇంకా 14 నెలలు సమయం ఉందని ఎమ్మెల్యేలకు, మంత్రులకు దిశానిర్దేశం చేయడంతో ప్రస్తుతానికి సీఎం జగన్ రెడ్డికి ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచన లేదని స్పష్టమైంది. ఆ ఒక్క మాటతో వైసీపీ ఎమ్మెల్యేలు జేబులో చేతులు పెట్టుకుని నడుచుకుంటూ వెళ్లిపోయినంత హ్యాపీగా ఫీలయ్యారు. ముందస్తుపై ప్రకటన చేస్తారేమోనని అప్పటివరకూ కొందరు ఎమ్మెల్యేలు మదనపడ్డారు. వాళ్లంతా రిలాక్స్ కావడం విశేషం. అంతేకాదు..

(మిగతా 2లో)

# ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ గల నేత నరేంద్ర మోదీ



**ప్రజా తపన ,న్యూఢిల్లీ**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాపులారిటీ రోజురోజుకీ పెరుగుతోంది. విదేశాల్లోనూ ఆయనకు మంచి క్రేజ్ ఉంది. ఇప్పటికే కొన్ని సర్వేలు మోదీకి ది బెస్ట్ పీఎం అంటూ కితాబిచ్చాయి. ఇప్పుడు మరో రిపోర్ట్ కూడా ఇదే విషయం వెల్లడించింది. అమెరికాకు చెందిన కన్సల్టింగ్ సంస్థ 'మార్నింగ్ కన్సల్ట్' భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేత అని వెల్లడించింది. అత్యధికంగా 76 శాతం రేటింగ్‌తో గ్లోబల్ లీడర్స్ అప్రూవల్ రేటింగ్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ తాజాగా విడుదల చేసిన జాబితా ప్రకారం ప్రజాదరణ విషయంలో అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ సహా ఏ ఇతర దేశాధినేతలు ఎవరూ మోదీకి దరిదాపుల్లో లేరు. వరుసగా రెండుసార్లు అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా మోదీ రికార్డ్ సృష్టించారు. 'మార్నింగ్ కన్సల్ట్' మొత్తం 22 మంది ప్రపంచ నాయకులపై సర్వే నిర్వహించింది. గ్లోబల్ లీడర్ అప్రూవల్

(మిగతా 2లో)

# పెరుగుతున్న కరోనా కేసులు



**ప్రజా తపన ,న్యూఢిల్లీ**

దేశంలో కరోనా కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. శనివారం దేశంలో 3824 కొత్త కొవిడ్ కేసులు నమోదు అయ్యాయి. రోజువారీ కేసుల పరంగా ఇది 6 నెలల్లో అత్యధిక సంఖ్య. అదే సమయంలో గత ఏడు రోజుల్లో కరోనా కేసులు పెరిగిన విధానం మూడవ వేవ్ తర్వాత అత్యధికం. మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వ తేదీ

(మిగతా 2లో)



# పవన్ కల్యాణ్‌కు బీజేపీ అధిష్ఠానం పిలుపు

**ప్రజా తపన ,న్యూఢిల్లీ**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీజేపీ అధినాయకత్వంతో భేటీ కానున్నారు. హోంమంత్రి అమిత్‌షాతోపాటు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కూడా సమావేశం కానున్నారు. ఉదయపూర్‌లో జరిగిన ఓ ఫంక్షన్‌కు వెళ్లిన పవన్ కల్యాణ్ ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగానే ఆయనతో బీజేపీ నాయకత్వం ప్రత్యేకంగా భేటీ కానున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దక్షిణాదిలో పాగా వేయాలని ఎప్పటి నుంచో బీజేపీ చాలా గట్టిగానే ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే తొలిసారిగా కర్ణాటకలో అధికారంలోకి వచ్చింది. దాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ. అక్కడి ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలన్న టార్గెట్‌తో వ్యూహాలను రచిస్తోంది బీజేపీ. కర్ణాటక ఎన్నికల్లో విజయం కోసం ఉన్న అవకాశాలన్నింటినీ వాడుకోవాలని చూస్తోంది భారతీయ జనతాపార్టీ. అందులో

(మిగతా 2లో)

# కూల్ రూఫ్ పాలసీ ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



**ప్రజా తపన హైదరాబాద్**

ఎండాకాలం వస్తే వీధే కాదు, ఇల్లు కూడా నిప్పులు కొలిమే అవుతుంది! కుండలో పెట్టి కుమ్మేసిన ఫీలింగ్! మనుషులంతా దమ్ బిర్యానీలా ఉడికిపోతారు! ఫ్యాన్ ఐదో నెంబర్ మీద పెట్టినా ఫాయిదా ఉండదు ! కూలరేస్తే గానీ కూసింత ప్రాణం ఆడదు. ఏసీ వేస్తేగానీ బతకలేమన్న భావనలోకి వస్తాం! ఫలితంగా పవర్ బిల్లు తడిసి మోపెడవుతుంది. వెయ్యి రూపాయలొచ్చే బిల్లు మూడింతలు, నాలుగింతలు పెరిగిపోతుంది. బిల్లుచూసి గుండెజారి పర్సులో పడుతుంది! మార్చి నుంచి మూర్ఛనలే! ఏప్రిల్, మే నెలల్ని తలుచుకుంటేనే వెన్నులో వణుకు పుడుతుంది! అటు ఎండ.. ఇటు కరెంటుబిల్లు బండ! వేసవితాపం శాపం కాకూడదనే కోణంలో, ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది ప్రభుత్వం. అందులో భాగమే తెలంగాణ కూల్‌రూఫ్ పాలసీ! మీ ఇల్లు చల్లగుండాలి! మీ జేబుకు చిల్లు పడకుండా ఉండాలి! ఈ కాన్సెప్టుతో రూపొందించిందే కూల్ రూఫ్ పాలసీ. మంత్రి కేటీఆర్ దీన్ని ఆవిష్కరించారు. కూల్‌రూఫ్ పాలసీ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే కార్యక్రమమని మంత్రి అభిప్రాయపడ్డారు. దీర్ఘకాలిక లక్ష్యాలతో, అందరికీ లాభం చేకూరేలా పాలసీ ఉంటుందని కేటీఆర్ తెలిపారు. భవిష్యత్ తరాల కోసం తెస్తున్న పాలసీగా అభివర్ణించారు. ఈ సంవత్సరం సిటీలో 5 చదరపు కి.మీ. నగరం అవతల 2.5 స్క్వేర్ కి.మీ. కూల్ రూఫ్ చేస్తామన్నారు. సైకిల్ ట్రాక్‌కు కూడా

(మిగతా 2లో)

## నీతికి ,న్యాయానికి బ్రాండ్ అంబాసిడర్ సిబిఐ

(మొదటిపేజీ తరువాయి)

మోసాల నుంచి వన్యప్రాణులకు సంబంధించిన నేరాల వరకు, సీబీఐ పరిధి చాలా విస్తరించిందని ఆయన తెలిపారు.నల్లధనం, బినామీ ఆస్తులపై ఇప్పటికే చర్యలు ప్రారంభించామని ప్రధాని చెప్పారు. "మేము ఇప్పటికే మిషన్ మోడ్‌లో నల్లధనం, బినామీ ఆస్తులపై చర్యలు ప్రారంభించాం. అవినీతిపరులతో పాటు అవినీతి కారణాలపై కూడా పోరాడుతున్నాం. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అవినీతికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో మా ప్రభుత్వం వెనకడుగు వేయదు" అని మోదీ అన్నారు.నేడు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత కారణంగా నేరాలు ప్రపంచవ్యాప్త మవుతున్నా యన్నది నిజమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే ఈ సమస్యలకు పరిష్కారం చూపుతుందన్న కూడా నిజమని... అందువల్ల పరిశోధనలలో ఫోరెన్సిక్ సైన్స్ వినియోగాన్ని మనం మరింత పెంచాలని సూచించారు. సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి మనం వినూత్న మార్గాలను కనుగొనాలని పిలుపునిచ్చారు. టెక్-ఎనేబుల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ ,యువకులు ఇందులో గొప్ప పాత్ర పోషించాలని ప్రధాని అభిలషించారు. అవినీతిపరులు ఎవరైనా, వారు ఎంత పెద్ద స్థానంలో ఉన్నా విడిచిపెట్టకూడదని ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. "దేశంలో అవిశ్వాసం, విధానపరమైన పక్షపాతం ఉన్న సమయాలు ఉన్నాయి. కానీ 2014 నుంచి, వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడం, పెంపొందించడం, బలోపేతం చేయడమే లక్ష్యంగా మేము పని చేస్తున్నాం అని తెలిపారు. 10 ఏళ్ల క్రితం అవినీతికి పాల్పడేందుకు పోటీ ఉండేదని.. ఆ సమయంలో పెద్దపెద్ద కుంభకోణాలు జరిగాయని ప్రధానమంత్రి అన్నారు. అయితే వ్యవస్థలు వారికి అనుకూలంగా ఉండటంతో నిందితులు భయపడేవారుకాదని చెప్పారు. తమ ప్రభుత్వం నల్లధనం, బినామీ ఆస్తులపై యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించిందని.. దీంతో పాటు అవినీతికి దారితీసే పరిస్థితులపై పోరాడుతోందని వెల్లడించారు. మీరు శక్తిమంతమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సీబీఐని ఉద్దేశించి పేర్కొన్న ప్రధానమంత్రి.. నిందితులుగా ఉన్న వారు ఏళ్ల తరబడి వ్యవస్థలో ఉన్నారని, ఇప్పటికీ వారు కొన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నారని తెలిపారు. అయినా వెనక్కి తగ్గకుండా మీరు మీ పనిపై మాత్రమే దృష్టిపెట్టండి అవినీతిపరుల్ని ఎట్టిపరిస్థితుల్లో వదలొద్దు అంటూ ప్రధాని సీబీఐ అధికారులకు సూచించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఏప్రిల్ 1, 1963న హోం మంత్రిత్వ శాఖ తీర్మానం ద్వారా ఏర్పాటైంది. ఈ దర్యాప్తు సంస్థ శనివారంతో 60 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఇంటర్‌పోల్ జనరల్ అసెంబ్లీ సందర్భంగా సీబీఐ ట్విట్టర్‌లోకి అడుగుపెట్టింది.

## ముందస్తు ఎన్నికలు లేవు

(మొదటిపేజీ తరువాయి)

పనిలోపనిగా తనకు బాకా ఊదని, ప్రజాపక్షం నిలిచే మీడియాపై కూడా తన అక్కసు వెళ్లగక్కారు. 60 మందికి టికెట్లు ఇవ్వమని ప్రచారం చేస్తున్నారని, ఒక్కో ఎమ్మెల్యేని టార్గెట్ చేసి విషప్రచారం చేస్తున్నారని జగన్‌రెడ్డి ఎమ్మెల్యేలతో చెప్పడం గమనార్హం. అసత్య ప్రచారాలను మనం తిప్పికొట్టలేకపోతున్నామని ఎమ్మెల్యేలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి లబ్దిదారుడిని మన ప్రచారకర్తగా తయారు చేసుకోవాలని, ఆగస్టు నాటికి గడపగడపకు ప్రభుత్వ కార్యక్రమం పూర్తి చేయాలని జగన్‌రెడ్డి ఎమ్మెల్యేలకు, మంత్రులకు దిశానిర్దేశం చేశారు. అయితే.. ఈ వర్క్‌షాప్ సాక్షిగా జగన్ తన డొల్లతనాన్ని బయటపెట్టుకున్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఏం చేశారో ఎమ్మెల్యేలతో కూడా చెప్పుకోలేని దుస్థితిలో పడిపోయారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో.. అభివృద్ధి పనులపై జనం తమను నిలదీస్తున్నా.. వచ్చే ఎన్నికల్లో టికెట్ రావడానికి ఈ కార్యక్రమంతో ముడిపెట్టడంతో ఇష్టం లేకున్నా వారు పాల్గొంటూ వస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు, నగదు పంపిణీ, లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలకు ఎలాంటి భాగస్వామ్యం లేదు. వలంటీర్లదే పెత్తనం. దీంతో నియోజకవర్గాల్లో తమకు విలువ లేకుండా పోయిందని ఎమ్మెల్యేలు లబోదిబో మంటున్నా జగన్ గానీ, నాయకత్వంగానీ పట్టించుకోవడం లేదు. పార్టీ, అధికారిక సమావేశాల్లో ఐ-ప్యాక్ బృందం సభ్యులు జగన్ ప్రతినిధుల్లా హాజరవుతున్నారు. ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి నుంచే నాయకత్వానికి నివేదికలు పంపుతున్నారు. దీనికితోడు తమ కదలికలపై అనుక్షణం సొంత ప్రభుత్వమే నిఘా పెట్టడం వారు సహించలేకపోతున్నారు.ఈ పరిస్థితుల్లో ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గాల శాసనమండలి ఎన్నికలు జరిగాయి. దొంగ ఓట్లను చేర్పించినా.. పదో తరగతి కూడా చదవనివారిని గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేయించినా.. చివరకు భారీఎత్తున రిగ్గింగ్‌కు పాల్పడినా.. మూడు స్థానాల్లోనూ వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. ఈ మూడు పట్టభద్ర స్థానాల పరిధిలో 9 ఉమ్మడి జిల్లాలు, 108 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పది లక్షల మంది విద్యావంతులు ఓటర్లుగా ఉన్నారు. వీరందరూ ఒకే విధంగా ఆలోచించి మరీ అధికార పార్టీని ఓడించి.. ప్రతిపక్ష తెలుగుదేశాన్ని భారీ ఆధిక్యంతో గెలిపించారు. మరో ఏడాదిలో అసెంబ్లీ ఎన్నికలు రానున్న తరుణంలో తమ ఉద్దేశమేమిటో తెలియజేశారు.

## ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ గల నేత నరేంద్ర మోదీ

(మొదటిపేజీ తరువాయి)

సర్వేలో ఈ ఏడాది జనవరి 26 నుంచి 31వ తేదీ మధ్య సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ప్రతీ దేశంలో వయోజన ప్రజల ఏడు రోజుల సగటును తీసుకుని దీన్ని రూపొందించారు.78 శాతం అమోదంతో భారత ప్రధాని నరేంద్ర మోదీ తొలి స్థానంలో నిలవగా, 68 శాతంతో మెక్సికో అధ్యక్షుడు ఆండ్రెస్ మాన్యువల్ రెండో స్థానంలో నిలిచారు. స్విట్జర్లాండ్ అధ్యక్షుడు ఆలైన్ బెర్సెట్ 62 శాతంలో 3వ స్థానంలో ఉన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ 58 శాతం ఆమోదంతో 4వ స్థానంలో నిలిచారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా 50 శాతంతో 5వ స్థానంలో ఉండగా, ఇటలీ తొలి మహిళా ప్రధానమంత్రి జార్జియామెలోని 52 శాతం ప్రజామోదంతో 6వ స్థానం దక్కించుకున్నారు.ఈ సర్వేలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 40 శాతంతో 7వ స్థానానికి పరిమితమయ్యారు. కెనడాప్రధాని 40 శాతం ఆమోదంతో 9వ స్థానంలో నిలిచారు. యూకే ప్రధాని రిషి సునాక్ 30 శాతంతో 12వ స్థానం దక్కించుకున్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సియోక్ యుల్, జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా 20, 21 స్థానాల్లో నిలిచారు. నార్వేప్రధాని జోనాస్ గహర్ 21 శాతంతో చివరి స్థానంలో ఉన్నారు.( పపంచవ్యాప్తంగా రోజుకు 20 వేల మందిని ఇంటర్వ్యూ చేసిన మార్నింగ్ కన్సల్ట్ ఈ ర్యాంకులు వెల్లడించింది. ఈ ఇంటర్వ్యూలు చేసిన సమయంలో వాళ్లు ఇచ్చిన సమాధానాల ఆధారంగా లిస్ట్ తయారు చేశారు. అమెరికాలో 45 వేల మందిని ఇంటర్వ్యూ చేశారు. మిగతా దేశాల్లో ఈ సంఖ్య 500-5000 మందిని ఇంటర్వ్యూ చేశారు.

## పెరుగుతున్న కరోనా కేసులు

(మొదటిపేజీ తరువాయి)

చివరి వారంలో భారత దేశంలో 18,450 కొత్త కేసులు నమోదయ్యాయి. అయితే ఈ సంఖ్య అంతకు ముందు వారంలో 8,781 కంటే రెండింతలు ఎక్కువ. కరోనా కేసుల రెట్టింపు సమయం 7 రోజుల కంటే తక్కువగానే ఉంది. థర్డ్ వేవ్ లోనే ఈ కరోనా కేసుల సంఖ్య విపరీతంగా పెరిగింది. అయితే ఈ సమయంలో కరోనా కారణంగా మృతుల సంఖ్య స్వల్పంగా పెరగడం కాస్త ఉపశమనం కలిగించే విషయం. గత వారం కరోనా కారణంగా 36 మంది మరణించారు. అయితే అంతకు ముందు ఈ సంఖ్య 29.గత ఏడు రోజుల్లో రెట్టింపు కేసులు నమోదు అవుతున్న రాష్ట్రాల్లో కేరళ మొదటి స్థానంలో ఉంది. కేరళలో కరోనా కేసుల సంఖ్య ఒక వారంలో 1333 నుండి దాదాపు 4000కి మూడు రెట్లు పెరిగింది. గోవా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా మరియు ఉత్తరప్రదేశ్ లలో కోరనా వేగంగా వృద్ధి చెందుతోంది. ఈ రాష్ట్రాల్లో గత వారంతో పోలిస్తే ఈ వారంలో కరోనా కేసుల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. గత వారం హిమాచల్ ప్రదేశ్‌లో కరోనా కేసులు 409 నుండి 1200కి పెరిగాయి.
రెండో స్థానంలో మహారాష్ట్ర మహారాష్ట్ర, గుజరాత్‌లలో గత కొన్ని వారాలుగా కరోనా కేసులు పెరుగుతున్నాయి. అయితే మహారాష్ట్రలో స్థిరంగా ఉండగా గుజరాత్‌లో తగ్గింది. మహారాష్ట్రలో ఈ వారం కరోనా కేసుల సంఖ్య 3323, ఇది గత ఏడు రోజుల్లో (1956 కేసులు) నమోదైన కేసుల కంటే 70 శాతం ఎక్కువ. ఆదివారం (ఏప్రిల్ 2) ఒక్కరోజే కరోనాతో ముగ్గురు చనిపోగా.. 550కి పైగా కేసులు నమోదయ్యాయి. హర్యానాలో పెరుగుతున్న కొవిడ్ -19 కేసులతో పాజిటివిటీ రేటు 4 శాతానికి చేరుకుంది. ఆరోగ్య శాఖ అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం మంత్రి అనిల్ విజ్ కోరారు. నిన్న వైద్యారోగ్య శాఖ సీనియర్ అధికారుల సమావేశం కూడా జరిగింది. రాష్ట్రంలో శనివారం సాయంత్రం విడుదల చేసిన కొవిడ్-19 బులెటిన్‌లో 579 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.కరోనా ఇన్ఫెక్షన్ పాజిటివ్ కేసుల పెరుగుదల దృష్ట్యా, తమిళనాడు ప్రభుత్వం ఏప్రిల్ 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఫేస్ మాస్క్‌లు ధరించడం తప్పనిసరి చేసింది. ఇతర దేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 1న రాష్ట్రంలో 123 మందికి కరోనా సోకింది. కర్ణాటకలో యాక్టివ్ కొవిడ్-19 కేసులు 1,400 మార్కును దాటాయి. మినీ థామస్ నివేదిక ప్రకారం.. మొత్తం కేసుల్లో 59 శాతం బెంగళూరులోనే నమోదయ్యాయి. ఏప్రిల్ 1న రాష్ట్రంలో 284 కొత్త కేసులు నమోదయ్యాయి.మహారాష్ట్రలో దాదాపు 550 కేసుల్లో 172 కేసులు ఒక్క ముంబైలోనే నమోదయ్యాయి. ఏప్రిల్ 2వ తేదీన ముంబైలో మొత్తం 172 కొత్త కరోనా కేసులు నమోదయ్యాయని బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (ఃఓఅ) అధికారిక బులెటిన్‌లో తెలిపింది. అదే సమయంలో రోగుల కోలుకునే రేటు 98.2 శాతంగా ఉంది. ఉదయం 8 గంటల వరకు భారతదేశంలో 3,824 కరోనా కేసులు నమోదయ్యాయి. 184 రోజుల్లో ఇదే అత్యధిక కేసులు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 18,389కి పెరిగింది. ఇంతలో ఐదు కొత్త మరణాలతో.. మరణాల సంఖ్య 5,30,881 కు పెరిగింది. అలాగే మొత్తం కరోనా కేసుల సంఖ్య 4.47 కోట్లకు చేరుకుంది. దేశంలో కరోనా కేసులు పెరగడం ఇది వరుసగా 7వ వారం. మనం కరోనాను చులకనగా చూడడం.. ఆ మనకేం వస్తుందిలే అనుకోవడంతో దాన్ని పెద్దగా పట్టించుకోవట్లేదు. కానీ కరోనా కేసులు పెరగడం అందరిలోనూ ఆందోళన కల్గిస్తోంది. కాబట్టి జాగ్రత్త.

## పవన్ కల్యాణ్‌కు బీజేపీ అధిష్ఠానం పిలుపు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగానే జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ని కూడా ప్రచారంలోకి దించాలని భావిస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో జనసేన, బీజేపీ పొత్తులో ఉన్నాయి. ఈ స్నేహంతోనే కర్ణాటకలో ప్రచారం చేయాలని రిక్వస్ట్ చేసే ఛాన్స్ ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన్ని ఢిల్లీకి పిలిపించి మాట్లాడబోతున్నట్టు సమాచారం. ఉత్తర కర్ణాటకలో చాలా వరకూ తెలుగు ప్రాబల్యమే ఎక్కువ. బళ్లారి దగ్గర మొదలుపెట్టి రాయచూరు, సింధనూరు, గంగావతి, దవణగిరి, గుల్బర్గ, బీదర్ వరకూ అయితే ఆంధ్రా, లేదంటే తెలంగాణ సెటిలర్స్ ది కీలక వర్గం. మరి ఆ తెలుగు ఓట్లను ప్రభావితం చేసేలా స్టార్ క్యాంపెయినర్ గా పవన్ ఉపయోగపడతారు అనేది బీజేపీ భావన. అందుకే ఆయన్ని స్టార్ క్యాంపెయినర్‌గా దించాలని బీజేపీ ప్లాన్. 2014 జనరల్ ఎలక్షన్స్ టైమ్‌లో జనసేన, టీడీపీ, బీజేపీ అలయన్స్‌లో ఉన్నాయి. అప్పుడు ప్రధాని మోదీ ఆదేశాల మేరకు పవన్ కల్యాణ్ కర్ణాటక ఎన్నికల్లో ప్రచారాన్ని నిర్వహించారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలు ప్రభావితమయ్యేలా ఉద్వేగభరిత ప్రసంగాలను చేసి ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మేలు చేశారు. 2019 ఎలక్షన్స్ టైమ్ నాటికి బీజేపీ, టీడీపీల దోస్తానాకు కట్ చెప్పిన పవన్ కల్యాణ్, వామపక్షాలు బీఎస్పీతో కలిసి ఏపీ ఎన్నికల్లో బరిలోకి దిగారు. అంతకు ఏడాది ముందు జరిగిన కర్ణాటక ఎన్నికల్లోనూ ప్రచారానికి వెళ్లకుండా వ్యూహాత్మకంగా సైలెంట్ అయిపోయారు పవన్ కల్యాణ్. ఈ మధ్యే కర్ణాటక ఎలక్షన్స్ షెడ్యూల్ వచ్చింది. 224 అసెంబ్లీ స్థానాలకుగానూ మే 10న ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఓటర్ ఓపినయన్ పొల్ వెల్లడించింది. దాదాపు అన్ని కీలకప్రాంతాల్లో ఈ పార్టీకే మెజార్టీ దక్కుతుందని తెలిపింది. సీట్ల పరంగా చూస్తే...గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 80 సీట్లు వచ్చాయి. బీజేపీ 104 చోట్ల విజయం సాధించింది. జేడీఎస్ 37 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్, జేడీఎస్ కలిసి అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. ఆ తరవాత బీజేపీ చేతుల్లోకి అధికారం మారిపోయింది. అయితే...ప్రస్తుత అంచనాల ప్రకారం చూస్తే...కాంగ్రెస్‌కు 121 సీట్లు వచ్చే అవకాశాలున్నాయి. బీజేపీకి 74 జేడీఎస్కి 29 సీట్లు దక్కనున్నట్టు ఈ సర్వేలో తేలింది. మొత్తంగా చూస్తే...కాంగ్రెస్‌కు 115 నుంచి 127 సీట్లు, బీజేపీకి 68 నుంచి 80, జేడీఎస్ కి 23 నుంచి 35 సీట్లు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కూల్ రూఫ్ పాలసీ ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

(మొదటిపేజీ తరువాయి)

సోలార్ రూఫ్ చేస్తున్నామని తెలిపారు. తమ ఇంటికి ముందే కూల్ రూఫ్ చేయించామని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రతీ చదరపు మీటర్‌కు రూ. 300 ఖర్చవుతుందని, రూఫ్‌తో పాటు గోడలకు కూడా వేయాలని సూచించారు. దీన్ని తప్పనిసరి చేస్తున్నామని తెలిపారు. కూల్ రూఫ్ ఉంటేనే అక్యూపెన్సి సర్టిఫికెట్ ఇస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు.దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం కూల్ రూఫ్ పాలసీని రూపొందించామని తెలిపారు కేటీఆర్. డబుల్ బెడ్‌రూం ఇళ్లపై కూల్‌రూఫ్ అమలు చేస్తామన్నారు. కూల్ పెయింట్ వేయడం వల్ల కరెంట్ చార్జీలు ఆదా అవుతాయిని అన్నారు. ఇప్పటికే కట్టిన భవనాలపై కూడా కూల్‌రూఫ్ విధానం అమలు చేయొచ్చని సూచించారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరగాలనేది సీఎం కేసీఆర్ ఆశయమన్నారు. పాలసీ, చట్టం చేయడం చాలా సులువు.. కానీ వాటిని అమలు చేయడం చాలా కష్టమని అన్నారు. కూల్ రూఫ్ అమలు చేస్తే రెండు సంవత్సరాల్లో ఎనర్జీ సేవింగ్ రూపంలో మన డబ్బులు మనకు వస్తాయన్నారు కేటీఆర్. హైదరాబాద్ సహా అన్ని మున్సిపాలిటీల్లో దీన్ని అమలు చేస్తామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పిస్తే 100 శాతం అమలవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి అపార్టుమెంటుకు వెళ్లి అవగాహన కల్పించాలని అన్నారు. అవసరమైతే ఇన్సెంటివ్ ఇస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఖీచీను కూడా ఇందులో భాగస్వామ్యం చేస్తామని వెల్లడించారు. త్వరలో మన నగరం కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు మంత్రి కేటీఆర్. ఇప్పుడు ఎక్కడ చూసినా మిద్దె తోటలు కనిపిస్తున్నాయని,, వాటిని ఎంకరేజ్ చేయాలని చెప్పుకొచ్చారు. దేశం మొత్తంలోనే హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఉందన్నారు మంత్రి కేటీఆర్. హైదరాబాదులో ఉన్న అవకాశాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. ఝ బీపాస్‌తో దేశంలో ఎక్కడాలేని విధంగా భవన నిర్మాణ అనుమతులు లభిస్తున్నాయన్నారు. 240 కోట్ల మొక్కలు నాటి సంరక్షిస్తున్నామని కేటీఆర్ తెలిపారు

## పన్ను వసూళ్ళలో రాష్ట్రంలోనే తిరుపతి మొదటి స్థానం

**తిరుపతి**

పన్ను వసూళ్ళలో, చాలా కాలంగా బకాయి వున్న పన్నులు వసూళ్ళు చేయడంలో రాష్ట్రంలోనే తిరుపతి మొదటి స్థానంలో నిలవడం జరిగిందని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి తెలియజేస్తూ రెవెన్యూ అధికారులను ప్రసంసించారు. తిరుపతి నగరంలోని 68,913 ఆస్తులకు సంబందించి రావల్సిన పన్నులు, బకాయిలు 65,92,72,936 రూపాయలు రావల్సి వుండగా 63,26,88,793 రూపాయాలను 96 శాతంతో వసూళ్ళు చేసి రాష్ట్రంలోనే తిరుపతి మొదటి స్థానం రావడం జరిగిందన్నారు. పన్ను వసూళ్ళకు కృషి చేసిన తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ డిసి చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి కె.ఎల్.వర్మాను, రెవెన్యూ ఇన్స్ పెక్టర్లు రాజశేఖర్, శంకరయ్య, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సూరిబాబు, మధుసూధన్ రెడ్డి, ప్రకాష్, నవీన్, జ్యోతీష్ రెడ్డిలను సోమవారం స్పందనలో ప్రత్యేకంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు అభినందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, పెద్దల సూచనలతో తమ ఆర్.ఐ.ల తోడ్పాటుతో నగరంలోని 102 సచివాలయ అడ్మిన్లు, ఇతర సెక్రటరీల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం పన్నులపై వడ్డి మాఫి చేసిన విషయాన్ని ప్రతి ఒక్క ఆస్తిదారులు, వసూళ్ళు చేయడం జరిగిందన్నారు.

## శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవాలు ప్రారంభం

**- శేషాచలాన్ని తలపించిన వసంతమండపం**

**తిరుమల ,**

తిరుమలలోని వసంతోత్సవ మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు సోమవారం శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఎండ వేడి నుండి స్వామివారు ఉపశమనం పొందేందుకు జరిపే ఉత్సవం కావడంతో దీన్ని ఉపశమనోత్సవం అని కూడా అంటారు. ఈ ఉత్సవంలో సుగంధాన్ని వెదజల్లే పుష్పాలతోపాటు పలురకాల మధురఫలాలను స్వామివారికి నివేదిస్తారు. ఈ వేడుకల కోసం ఆకర్షణీయంగా మండపాన్ని రూపొందించారు. అలాగే పలురకాల జంతువులు, చెట్ల ప్రతిరూపాలతో శేషాచల అడవిని తలపించేలా ఈ మండపాన్ని తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి వారు నాలుగు మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేశారు. ఉదయం ఆస్థానం చేపట్టారు.వైభవంగా స్నపనతిరుమంజనం వసంతోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు శ్రీ భూ సమేత మలయప్పస్వామివారికి స్నపనతిరుమంజనం శోభాయమానంగా జరిగింది. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, నవకలశాభిషేకం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మది(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోదకం(గంధం)తో స్నపనం నిర్వహించారు. వీటితో శంఖధార, చక్రధార, సహస్రధార, మహాకుంభాభిషేకాలను వైఖనసాగమోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా తైత్తరీయ ఉపనిషత్తు, పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, పంచశాంతి మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానం చేసే పాశురాలను వేదపండితులు పఠించారు. ఈ వేడుకలో ఒక్కో క్రతువులో ఒక్కో రకమైన ఉత్తమజాతి పుష్పమాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్లు సాయంత్రం అక్కడినుండి బయల్దేరి ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ఎమ్మెల్యేలు ఎక్కువ - ఆశావహులూ ఎక్కువే !

**విజయవాడ:**

ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు తన కేబినెట్‌లో మార్పు చేర్పులు చేయాలనుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రాక ముందే కేబినెట్‌లో మార్పు చేర్పుల గురించి సీఎం జగన్ సూచనలు ఇచ్చారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. ఇప్పుడు ఖచ్చితంగా మంత్రివర్గాన్ని మార్చాలని అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అయితే గతంలోలా అంత సులువుగా అయ్యే రాజకీయ పరిస్థితులు లేవు . గతంలో మంత్రులందరి వద్ద రాజీనామాలు తీసుకున్నప్పుడు పరిస్థితులు వేరు.. ఇప్పటి పరిస్థితులు వేరు. గతంలో ఆయన మాటను సీనియర్లు కూడా జవదాటేవారు కాదు. కానీ ఇప్పుడు ఎన్నికలకు ముందు ఆయనకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి.సీఎం జగన్ గత ఎన్నికల్లో అతి భారీ మెజార్టీ సాధించడం కూడా ఆయనకు ఇప్పుడు ఇబ్బందికరంగా మారింది. ఎమ్మెల్యేల్లో అత్యధిక మంది రాజకయంగా తనతో నడుస్తున్న వారే ఉన్నారు. వారంతా మంత్రి పదవులు కోరుకుంటున్నారు. కానీ వివిధ రాజకీయ సమీకరణాల రీత్యా మధ్యలో వచ్చి చేరిన సీనియర్లకు పదవులు ఇవ్వాల్సి వచ్చింది. ఈ కారణంగా తనతో పాటు నడిచిన ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వలేకపోయారు.వారంతా తమకు చాన్స్ కోరుకుంటున్నారు. తమకు లేని చాన్స్ మధ్యలో వచ్చిన వారికి రావడం వారిని మరింత ఇబ్బంది పెడుతోంది. ఇలాంటి సీనియర్లు ప్రతీ జిల్లాలోనూ ఉన్నారు. ఆ అసంతృప్తి గతంలో మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ జరిగినప్పుడే బయటపడింది. చాలా మందిని సీఎం జగన్ ప్రత్యేకంగా బుజ్జగించాల్సి వచ్చింది.ఏడాది కిందట వరకూ సీఎం జగన్ ఏది చెబితే అది శాసనం. కానీ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేసిన తర్వాత సీన్ మారిపోయింది. ఆయన పై ఎమ్మెల్యేలు చాలా మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాటలను కూడా వినిపించుకోలేదు. ఇలాంటి వారిలో అత్యధికులు జగన్ వెంట నడిచినవారే. అదే సమయంలో మంత్రి పదవులు కోల్పోయినవారిలోనూ అసంతృప్తి ఉంది. కానీ బయట పడలేదు. కొడాలి నాని, పేర్ని నాని, సుచరిత వంటి వారు తామేం తప్పు చేశామని ఫీలయ్యారు. సుచరిత ఒక్కరే బయటపడ్డారు. తమ ప్రాధాన్యతను సీఎం జగన్ గుర్తిస్తారని ఇతర మంత్రులు ఆశతో ఉన్నారు. ఇప్పుడు మంత్రివర్గంలో మార్పు చేర్పులు అనేసరికి వారు కూడా ఆశలు పెంచుకుంటున్నారు. ఇలాంటి వారికి అందరికీ సీఎం జగన్ పదవులు ఇవ్వలేరు. అలాగే వారు అసంతృప్తిని వ్యక్తం చేస్తే బుజ్జగించడమూ కష్టమే. ఎమ్మెల్యేలపై సీఎం జగన్‌కు పూర్తి స్థాయి పట్టు ఉందని అనుకున్నారు. కానీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అది పూర్తిగా నిజం కాదని తేలిపోయింది. నలుగురు ఎమ్మెల్యేలు అధికార పార్టీని ధిక్కరించి ప్రతిపక్ష పార్టీకి ఓటు వేయడం అంటే చిన్న విషయం కాదు. అదీ కూడా ఏడాదిపైగా అధికారం ఉన్న సమయంలో. అధికార పార్టీకి విపక్ష సభ్యులు మద్దతిస్తే అందులో ఓ లాజిక్ ఉంటుంది . కానీ పార్టీపై పూర్తి స్థాయిలో పార్టీపై పట్టు ఉన్నట్లుగా భావిస్తున్న జగన్ పార్టీలో ఇలా జరగడం మాత్రం ఆశ్చర్యమే కాదు. ఇంకా చాలా మంది ఎమ్మెల్యేలు అసంతృప్తిలో ఉన్నారన్న ప్రచారం జరగడమూ ఇబ్బందికరమే. వీరిలో పార్టీలో ...ప్రభుత్వంలో ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తిలో ఉన్నారు. మంత్రివర్గ విస్తరణ తర్వాత ఇలాంటి వారిని కంట్రోల్ చేయడం కష్టమే. ప్రస్తుతం పదవుల్ని కోల్పోయే మంత్రులు కూడా అసహనానికి గురవుతారు. తమను పనికి రాని వాళ్లుగా తేల్చి తీసేస్తున్నారని వారు ఫీలయితే మొదటికే మోసం వస్తుంది. అందుకే సీఎం జగన్ ఇప్పుడు కత్తిమీద సాములా కేబినెట్‌లో మార్పుచేర్పులు చేయాల్సి ఉంది.

# 2019 తరహాలనే ఒంటరి పోరా..

**అసెంబ్లీ కన్వీనర్లను నియమించిన బీజేపీ**

**రాజమండ్రి:**

ఏపీలో 175 నియోజకవర్గాలు ఉంటే.. 147 చోట్ల అసెంబ్లీ కన్వీనర్లను.. కో కన్వీనర్లను నియమించింది బీజేపీ. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమన్న సంకేతాలు ఇచ్చింది. అయితే కన్వీనర్ల నియామకమే కొత్త చర్చకు ఆస్కారం ఇస్తోంది. ఇటీవల జనసేనతో పొత్తు.. ఆ పార్టీ సహకారంపై బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశంలో చర్చించారు. జనసేన తమకు ఎంత మాత్రం సహకరించడం లేదని మెజారిటీ నేతలు తమ అభిప్రాయంగా చెప్పారని టాక్. ఆ తర్వాత అసెంబ్లీ కన్వీనర్ల నియామకం బయటకు రావడంతో బీజేపీ ఓ నిర్ణయానికి వచ్చే ఈ ప్రకటన చేసిందని సమాచారం. జనసేన తమతో కలిసి రాదనే అభిప్రాయాన్ని బయటకు చెప్పకపోయినా.. ఆ విషయంలో ఒక స్పష్టతకు వచ్చిన ఏపీ బీజేపీ నేతలు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరి పోరుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. చివరి వరకు వేచి చూసేకంటే.. ముందుగానే అసెంబ్లీ సెగ్మెంట్లకు కన్వీనర్లను ప్రకటించి పార్టీ పని మొదలుపెట్టి.. అభ్యర్థులను ఎంపిక చేసి ఫీల్డ్‌లోకి దిగొచ్చనే ఆలోచనలో కమలనాథులు ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల వాదన. జనసేన కలిసి వచ్చినా రాకున్నా.. బీజేపీ బలోపేతం కావాలి కదా అని పదాధికారుల సమావేశంలో పార్టీ అగ్రనేత శివప్రకాష్ ప్రశ్నించారని.. క్షేత్రస్థాయిలో పార్టీ ప్రతినిధులు లేకపోతే ఇబ్బంది పడాల్సి వస్తుందని ఏపీ నేతలను ఆయన హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం 147 నియోజకవర్గాలకు సారథులను ఖరారు చేశారుప్రస్తుతం అసెంబ్లీ కన్వీనర్లుగా ఉన్నవారే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారనే వాదన బీజేపీలో ఉంది. అదే జనసేనతో పొత్తుపై ఆశలు సజీవంగా ఉండి ఉంటే 147 నియోజకవర్గాలకు ఈ విధంగా కన్వీనర్లను.. కో కన్వీనర్లను ప్రకటించరు కదా అని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉండటంతో.. ఈలోగా వారి పనితీరును ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుని అభ్యర్థులుగా ఖరారు చేయొచ్చనే అభిప్రాయంలో కూడా బీజేపీ ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీని విమర్శించే ప్రతి ఒక్కరూ అసలు 175 నియోజకవర్గాల్లో పార్టీకి అభ్యర్థులు ఉన్నారా అని ప్రశ్నిస్తుంటారు. ఆ విమర్శలకు కన్వీనర్ల నియామకంతో చెక్ పెట్టినట్టుగా కొందరి వాదన. మొత్తానికి నియోజకవర్గాల్లో బీజేపీ నాయకత్వాన్ని సిద్ధం చేయడం.. కన్వీనర్ల పేరుతో కార్యక్రమాల స్పీడ్ పెంచడం.. ఒంటరి పోరుకు కూడా సిద్ధమనే సంకేతాలు ఇవ్వడానికి ఏపీ లీడర్స్ క్రమంగా అడుగులు వేస్తున్నట్టు అర్థం అవుతోంది.గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏపీలో బీజేపీ సింగిల్‌గానే పోటీ చేసింది. నోటా కంటే తక్కువ ఓట్లు వచ్చాయనే విమర్శలు మూటగట్టుకుంది. 2019 ఎన్నికల తర్వాత పార్టీ రాష్ట్రంలో బలపడిందా అంటే.. పెదవి విరిచే పరిస్థితి. ఈ మూడేళ్లలో జరిగిన తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు ఉపఎన్నికలు, స్థానిక సంస్థలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్లలో బీజేపీకి వచ్చిన ఓట్లు ఆ పార్టీ బలాన్ని తెలియజేస్తున్నాయి. పొరుగునే ఉన్న తెలంగాణలోనూ ఏపీలోని బీజేపీ పరిస్థితికి అస్సలు పొంతన లేదు. తెలంగాణ మాదిరి పురోగతి ఉంటే ఈపాటికే బీజేపీ అగ్రనేతల ఫోకస్ పెరిగేది. అసలు ఢిల్లీ పెద్దలు ఏపీ బీజేపీ శాఖను పట్టించుకుంటున్నారో లేదో అన్న సందేహాలు పార్టీ శ్రేణుల్లోనూ ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఒంటరిపోరు అంటే బీజేపీ ఏ పొజిషన్‌లో ఉంటుందో చూడాలి.

# ఇంకా ప్రొబేషన్ లోనే 17 వేల మంది

**విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు రెండో విడత ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. 2020 డిసెంబరులో నెలలో రెండో విడతలో ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు 2022 డిసెంబరు నెలతో రెండేళ్లు సర్వీసు పూర్తయినప్పటికీ నేటికీ ప్రొబేషన్ డిక్లేర్ చేయలేదు. ఉద్యోగ సంఘ నాయకుల ద్వారా ఎప్పటికప్పుడు ప్రయత్నాలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పష్టత రావడం లేదు. రెండో విడతలో ఎంపికైన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ జూలైలో కానీ లేక ఆగస్టులో ఉండే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ, అప్పుడైనా ప్రకటిస్తారా? అంటే అధికారుల నుంచి సరైన సమాధానం లేదని ఉద్యోగులు ఆందోళన ?ందుతున్నారు.మొదటి నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ అయిన వారికి 9నెలలు ఆలస్యంగా ప్రొబేషన్ డిక్లేర్ చేశారు. గతేడాది మార్చి నాటికే ప్రొబేషన్ డిక్లేర్ ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు. ఆ గడువు పూర్తయి ఏడాది గడచినా ఇంతవరకు దీని అతీగతి లేదు. మార్చి నెల ముగుస్తున్నా ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి కాక పోవడంతో ప్రొబేషన్ కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రొబేషన్ డిక్లేర్ కాక పోవడంతో సుమారు 17వేల మంది ఉద్యోగులు కేవలం రూ.15వేల జీతానికి విధులు నిర్వహించడం కష్టంగా మారిందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కోరుతోంది. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ఎంపికైన 7040 మంది గ్రేడ్ -5 పంచాయితీ కార్యదర్శులకు నేటికీ అధికారాల బదిలీ జరగలేదు. దీంతో జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్‌శాఖ విడుదల చేసిన జీఓ నెంబరు 149లో డిడిఓ అధికారాలు ఉంటాయని పేర్కొంది. అధికారాల బదిలీల ప్రక్రియ నేటికీ పూర్తి కాలేదు. క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి ప్రతి పంచాయితీ కార్యదర్శిని నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్?5 పంచాయతీ కార్యదర్శులకు రూ. 15,030 కనిష్టంగా పే స్కేలును సిఫార్సు చేయగా, గరిష్టంగా రూ. 46,060గా పేర్కొంది. డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీసు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్, ఫిషరీస్ అసిస్టెంట్, ఏఎన్ఎం, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రేడ్?2 అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సర్వేయర్, వీఆర్వో, వేల్ఫర్ అసిస్టెంట్లకు రూ. 14,600 కనిష్ట పే స్కేలును ప్రతిపాదించగా, గరిష్ట పే స్కేలు రూ. 44,870గా పీఆర్సీ కమిటీ సిఫార్సు చేసింది. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీకి రూ. 15,030 కనిష్ట పే స్కేలును సిఫార్సు చేయగా, గరిష్టంగా రూ. 46,060గా పేర్కొంది. మిగిలిన వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్?డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, ప్లానింగ్ అండ్ రెగ్యులరైజేషన్ సెక్రటరీ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీ, వెల్ఫర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలకు రూ. 14,600 కనిష్టంగా పే స్కేలును ప్రతిపాదించగా, గరిష్ట పే స్కేలు రూ. 44,870గా ఉంటుంది.

# స్టాలిన్ నేతృత్వంలో 17 పార్టీల మీటింగ్

**న్యూఢిల్లీ :**

2024 ఎన్నికల్లో బీజేపీని ఢీకొట్టేందుకు ప్రతిపక్షాలన్నీ ఒక్కటవుతున్నాయి. కీలక నేతలందరూ ఎవరికి వారు విపక్షాలను ఏకం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కే స్టాలిన్ పావులు కదుపుతున్నారు. బీజేపీయేతర పార్టీల నేతలు ఢిల్లీలో స్టాలిన్ నేతృత్వంలో సమావేశం కానున్నారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఫర్ సోషల్ జస్టిస్ లో భాగంగా ఈ మీటింగ్ ఏర్పాటు చేసుకోనున్నారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోట్, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఈ సమావేశానికి హాజరు కానున్నారు. ఇక ప్రధాని అభ్యర్థి రేసులో ఉన్న కీలక నేతలు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఈ సమావేశంలో పాల్గొనేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే...వీలుని బట్టి ఆన్‌లైన్‌లోనే మీటింగ్‌లో పాల్గొంటారని తెలుస్తోంది. స్టాలిన్ వీరందరికీ నేతృత్వం వహించనున్నారు. తృణమూల్ కాంగ్రెస్ తరపున ఓ ఎంపీ హాజరు కానున్నారు. ఆప్ తరపున ఎంపీ సంజయ్ సింగ్ పాల్గొంటారు. బీఆర్ఎస్ తరపున ఎంపీ డాక్టర్ కేశవ రావు హాజరవనున్నారు. డిఎంకే నేతృత్వంలో ఇలా విపక్షాలు ఒక్కటవడం ఇది రెండోసారి. స్టాలిన్ 70వ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్, జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా పాల్గొన్నారు. విపక్షాలను ఒక్కటి చేసి బలమైన ప్రతిపక్షాన్ని తయారు చేయాలని స్టాలిన్ ప్లాన్ చేస్తున్నారు. రాహుల్ గాంధీపై అనర్హతా వేటు వేసిన తరవాత విపక్షాలన్నీ ఒక్కటవుతున్నాయి. కాంగ్రెస్‌తో సైద్ధాంతిక విభేదాలున్న పార్టీలు కూడా బీజేపీ వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. ఈ నిర్ణయం సరికాదని గట్టిగానే వాదిస్తున్నాయి. ఇప్పుడీ పరిస్థితులనే కాంగ్రెస్ తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తోంది. విపక్షాల మధ్య మైత్రి పెంచాలని చూస్తున్నాయి. ఈ క్రమంలోనే కొన్ని పార్టీలు విభేదాలన్నీ పక్కన పెట్టి కాంగ్రెస్‌తో చేయి కలుపుతున్నాయి. రాహుల్ అనర్హతా వేటుపై పార్లమెంట్‌లో ఎలాంటి వ్యూహాలు అనుసరించాలి..? బీజేపీతో ఎలా పోరాడాలి..? అనే అంశాలపై కాంగ్రెస్ కీలక సమావేశం ఏర్పాటు చేసింది. ఈ భేటీలో డీఎమ్‌కే, ఎస్‌పీ, జేడీయూ, బీఆర్ఎస్, సీపీఎమ్ సహా మొత్తం 17 పార్టీలు కాంగ్రెస్‌కు అండగా నిలిచాయి. అన్నింటికన్నా ఆసక్తికరమైన విషయం ఏంటంటే ఈ మీటింగ్‌కు తృణమూల్ కాంగ్రెస్ నేతలూ హాజరవడం. మొదటి నుంచి బీజేపీ, కాంగ్రెస్‌కు దూరంగా ఉంటోంది టీఎంసి.ప్రతిపక్షాల వ్యూహాలపై జరిగిన కీలక సమావేశంలో తృణమూల్ నేతలు హాజరవడం ఆసక్తికరంగా మారింది. ఎవరి ఐడియాలజీ వారిదే అయినప్పటికీ...ఈ సమయంలో అన్ని పార్టీలు ఏకం అవడం చాలా ముఖ్యం అని, బీజేపీపై పోరాడడానికి ఇదే మంచి తరుణం అని చెబుతోంది కాంగ్రెస్. బీజేపీపై పూర్తి స్థాయి పోరాటం మొదలు పెట్టిన కాంగ్రెస్‌పై టీఎంసికి కాస్త నమ్మకం ఏర్పడినట్టుగా కనిపిస్తోంది. దీనిపై మల్లికార్జున్ ఖర్గే స్పందించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలనుకునే ఏ పార్టీకైనా ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేశారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై ఏప్రిల్ 14 నుంచి 30 వరకు వామపక్షాల ప్రచారం

## రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా వ్యతిరేకించని స్థితిలో వైకాపా, టిడిపి, జనసేనలు

**కాకినాడ :**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ నుంచి 30 వరకు గ్రామ గ్రామాల్లో ఉభయ వామపక్షాల (సిపిఐ, సిపిఎం) ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్లు తెలిపారు. రాష్ట్రానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా, ఇచ్చిన హామీలను నెరవేర్చక పోతున్నా దాన్ని ప్రశ్నించలేని స్థితిలో రాష్ట్రంలోని వైకాపా, టిడిపి, జనసేన పార్టీలు ఉన్నాయని వారు చెప్పారు. సోమవారం కాకినాడ నగరంలోని జిల్లా సిపిఐ కార్యాలయంలో వామపక్ష పార్టీలకు చెందిన నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపాక మధు, ఎం రాజశేఖర్లు మాట్లాడుతూ దేశంలో జాతీయ రాజకీయాల్లో ప్రమాదకరమైన ధోరణిలు కనిపిస్తున్నాయన్నారు మోడీ ప్రధానమంత్రి ఆయన తరువాత తొలిసారిగా పార్లమెంట్లను ముద్దు పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షత్వాన్ని దేశంలో భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తానని చెప్పిన దాన్ని పాటించడంలో విఫలమయ్యారన్నారు పైగా దేశ సంపదను కార్పొరేట్ రంగాలకు దారాదత్తం చేసి పేదలపై భారాలు మోపుతున్నారన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 నుంచి 30 వరకు చైతన్య కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మోదీ రాజ్యాంగాన్ని, పార్లమెంట్‌ను పూర్తిగా అగౌరవపరిచారని పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం అదానీ కుంభకోణం గురించి చర్చించుకుంటున్నా మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆరోపించారు. అదానీ ఎపిసోడ్‌పై జాయింట్ పార్లమెంటరీ కమిటీని వేయాలన్న డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని పేర్కొన్నారు. ఓ పక్క




నిత్యవసర, గ్యాస్ ధరలు పెరుగుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. అదేవిధంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ ఆపేందుకు సీఎం జగన్ ప్రయత్నించకపోవడం దారుణమని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న మధ్యలో ఢిల్లీకి సీఎం జగన్ వెళ్లారని ఎందుకు వెళ్లారో కూడా నేటికి బహిర్గతం చేయలేదని మధు, రాజశేఖర్లు చెప్పారు. ఈ సమావేశంలో సిపిఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సిపిఎం నాయకులు కె వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# మా ఆస్తులకు మాకు రక్షణ కల్పించండి

## మోసగాడు దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోండి

**అనకాపల్లి**

చిన్న పిల్లల వైద్యనిపుణులు ఉమామహేశ్వరరావు వితంతువు మాదాబత్తుల నాగరత్నం న్యాయవాది దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం జరిపించాలని కోరుతూప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు లేట్ ఉమా మహేశ్వరరావు భార్య మాదాబత్తుల నాగరత్నం సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తనను తన కుమారులను మానసికంగా భయభ్రాంతులను చేస్తున్న న్యాయవాది దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం జరిపించాలని కోరుతూ తనను తన కుమారులను మానసికంగా భయభ్రాంతులను చేస్తున్న న్యాయవాది దొమ్మేటి రవితేజ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాగరత్నం, ఆమె రెండవ కుమారుడు సాయి శ్రీ శశాంక్ మాట్లాడుతూ 2020 కరోనా సమయంలో తన భర్త డాక్టర్ ఉమామహేశ్వరరావు కరోనా బారిన పడి మరణించారన్నారు. తన కుమారులు ఇద్దరు ఒకరు వైజాగ్ లో ఉద్యోగం చేస్తూ మరొకరు ఎంబిబిఎస్ చదువుతున్నారని వారు దగ్గర లేకపోవడం, నా భర్త పోయిన మనోవ్యాధిలో నేను ఉండటం జరిగిందన్నారు. ఆ సమయంలో అమరావతి హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నానంటూ మీకు మీ ఆస్తులకు ప్రస్తుతం రక్షణ లేదని మీకు ప్రాణహాని ఉందని నేను మీకు అండగా ఉంటానని దొమ్మేటి రవితేజ అన్న వ్యక్తి పరిచయం చేసుకొని తనను నమ్మించాడని అన్నారు. ఆ నమ్మకంతో ఉన్నప్పుడే గొలగంలో నాలుగు కోట్ల రూపాయలు విలువ గల స్థలాన్ని ఇతరులు కాజేసే ప్రయత్నం చేస్తున్నారని తమ పేరు మీద రాస్తే ఆ సమస్యలు పరిష్కారం అయిన తర్వాత తిరిగి మీ పేరు మీద వ్రాసేస్తా అని నమ్మ పలకడంతో అతని పేరుపై రాశానని అన్నారు. అయితే అతడు మోసగాడు అని తెలుసుకోవడం వలన నా పిల్లలు ప్రశ్నిస్తే నా రెండవ కుమారుడు పై తిరిగి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, రేప్ కేసు పెట్టారని అన్నారు. రవితేజ అన్న వ్యక్తి వల్ల చాలా డబ్బు నష్టపోయామని మాకు న్యాయం చేసి మాకు రక్షణ కల్పించాలని పోలీసేలను కోరారు.

# ఎస్కార్ట్ లేకుండానే ప్రశ్నపత్రాల తరలింపు

**హైదరాబాద్**

సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. సాధారణంగా పరీక్షలకు సంబంధిత ప్రశ్నపత్రాలు స్థానిక పోలీస్ స్టేషన్ కస్టడీలో ఉంచుతారు. పరీక్షకు 30నిమిషాల ముందు సంబంధిత పోలీస్ స్టేషన్ నుండి పోలీస్ ప్రొటెక్షన్ తో ఆ ప్రశ్న పత్రాలను జాగ్రత్త గా సెంటర్ లోకి తీసుకువస్తారు. కానీ హైద్రాబాద్ రాంకోట్ లోని అలెన్ స్కూల్ పరీక్ష సెంటర్ లో నిర్లక్షంగా కనీస పోలీసు భద్రత లేకుండా ఒక అటెండర్ తో పోలీస్ స్టేషన్ నుండి కాలి నడక తో పరీక్ష ప్రశ్నపత్రాలు తెప్పించారు. రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో పేపర్ లీకేజీ వ్యవహారం చల్లారక ముందే మరో ప్రశ్న పత్రాల నిర్లక్ష్యం




బయటపడింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థని విద్యార్థుల తల్లిదండ్రులు తప్పుపడుతున్నారు. ఇలా ఏలాంటి భద్రత లేకుండా ప్రశ్న పత్రాలు లు కాలి నడకన తీసుకువస్తున్నప్పుడు దారి మధ్యలో ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. ఒక్క చిన్న నిర్లక్ష్యంతో పరీక్ష రాసే పిల్లలపై ఎంతో భారం పడుతుందని వారంటున్నారు.ఇలా నిర్లక్యం మళ్ళీ జరగకుండా అటు ప్రభుత్వం ఇటు పోలీసులు చర్యలు తీసుకోవాలని 10వ తరగతి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# చిన్నారి కిడ్నాప్

**నెల్లూరు**




నెల్లూరు నగరం లోని గుర్రాల మడుగు సంఘంలో ఏడాదిన్నర పాప కిడ్నాప్ కు గురవడం కలకలం రేపింది. సోమవారం తెల్లవారు జామున ఊయలలో ఉన్న పాపను దుండగులు ఎత్తుకెళ్లారు. కిడ్నాపర్లు ఊయలలో బొమ్మను ఉంచి పాపను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పాప తల్లిదండ్రులు అనూష, మణికంఠ పోలీసులకు పిర్యాదు చేసారు. ఈ తెల్లవారుజామున పాపను ఎత్తుకెళ్లినట్లుగా భావిస్తున్నారు.

## శ్రీవారి సేవలో జాహ్నవి కపూర్..

**తిరుమల**

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.. సోమవారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో బాలీవుడ్ నటీ జాహ్నవి కపూర్,మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ, టిటిడి మాజీ పాలక మండలి సభ్యులు ఓ.వీ.రమణలు వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గోని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు.. ఆలయం వెలుపలకు వచ్చిన జాహ్నవి కపూర్ తో ఫోటోలు దిగేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు

## అనకాపల్లి లో వైసీపీ కి ఎదురుదెబ్బ

**అనకాపల్లి**

అనకాపల్లి నియోజకవర్గం అనకాపల్లి మండలం లో మేజర్ పంచాయతీ అయిన తుమ్మపాలకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు పల్లెల గణేష్ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి తన 70 మంది అనుచరులతో జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు సమక్షంలో జనసేన పార్టీ లోకి చేరారు. భాస్కరరావు వారికి జనసేన కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయాల్లో మార్పు కేవలం పవన్ కళ్యాణ్ తోనే సాధ్యం అని అన్నారు. రాష్ట్రంలో తన సొంత డబ్బుతో ప్రజలకు సేవ చేస్తున్న ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని పేర్కొన్నారు. జనసైనికుల సమిష్టి కృషితో అనకాపల్లి లో మరియు రాష్ట్రంలో జనసేన జెండా తప్పకుండా ఎగురుతుంది అని అన్నారు. అనంతరం పల్లెల గణేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు తమను ఎంతో ఆకర్షించాయి అని అన్నారు. అనకాపల్లి లో జనసేన పార్టీ ని గెలిపించి భాస్కరరావు ని అసెంబ్లీ కి పంపించేందుకు తాము అందరం కృషి చేస్తాము అని అన్నారు.

## తమ్ముడిని హతమార్చిన అన్న

**జగ్గయ్యపేట**

ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం మంగొల్లు గ్రామంలో దారుణం జరిగింది. సొంత తమ్ముడిని అన్నే హత్య చేసాడు. ఆస్తి తగాదాల నేపధ్యంలో హత్య జరిగింది. అడ్డువచ్చిన తల్లి, మరో మహిళకు గాయాలు అయ్యాయి. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మృతుడు రవి తల్లి భారతమ్మ కోమాలో ఉన్నది

## కోర్టుకు హజరయిన వైకాపా నేతలు

**ఏలూరు**

వైఎస్ఆర్ సీపీ నాయకులు దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావు సహా ఏడుగురు నిందితులు సోమవారం నాడు నూజివీడు రెండో అదనపు ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి ముందు హాజరైయారు. 2018 జూన్25న కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ వద్ద వైఎస్ఆర్సిపి నాయకులు ధర్నా చేసారు. ఈ వ్యవహారంలో నమోదైన కేసుకు సంబంధించి వాయిదాకు గత శుక్రవారం నూజీవీడు కోర్టుకు వైఎస్సార్సీపీ నాయకులు రాలేదు. దాంతో న్యాయమూర్తి దుట్టా రామచంద్రరావు, యార్లగడ్డ వెంకట్రావుతో సహా ఆరుగురికి నాన్ బెయిల్ బుల్ వారెంట్ జారీ చేసారు. వారెంట్ అమలుకు హనుమాన్ జంక్షన్ పోలీసులు వెళ్తే ఇంటి వద్ద ఎవరు అందుబాటులో లేకపోవడంతో తిరిగివచ్చారు. తాజాగా సోమవారం వారందరూ న్యాయమూర్తి ముందు హాజరయ్యారు.

## ఐదుగురు మావోయిస్టులు హతం

**చిత్ర**

జార్ఖండ్ రాష్ట్రంలో చిత్ర జిల్లాలో భారీ ఎన్కౌంటర్ చోటు చేసుకుంది. ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టు మృతి చెందారు. ఘటనా స్థలం నుండి రెండు ఏకే 47 తుపాకులను పోలీసులుస్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేత ఉన్నట్లు సమాచారం. చనిపోయిన ఐదుగురులో ఇద్దరు మావోయిస్టులపై రివార్డులున్నట్లు తెలుస్తుంది

# సస్పెండ్ ఎమ్మెల్యేల కటౌట్లతో శవయాత్ర

**నెల్లూరు:**

నిన్న మొన్నటి వరకు జై కొట్టిన నోటితోనే ఇప్పుడు ఆ ఎమ్మెల్యేలను కొందరు ఛీ కొడుతున్నారు. నలుగురు వైసీపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు పడిన తర్వాత ఈ ఛీదరింపులు, ఛీవాట్లు మరింత ఎక్కువయ్యాయి. నెల్లూరు జిల్లాలో తొలిసారిగా పార్టీకి దూరంగా జరిగారు ఆనం రామనారాయణ రెడ్డి. ఆయన స్థానంలో నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని ఇన్ చార్జ్ గా ప్రకటించారు. ఆ తర్వాత పెద్దగా ఆనంపై ఆగ్రహ జ్వాలలేవీ బయటపడలేదు. ఇటీవల ఆనంను కూడా పార్టీనుంచి సస్పెండ్ చేసిన తర్వాత ఆయనపై వ్యతిరేకత పెద్ద ఎత్తున పెరిగింది.నిన్న మొన్నటి వరకు ఆనంకు జై కొట్టినవారే ఇప్పుడు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వెంకటగిరిలో ఆనం వర్గంగా ఉన్నవారంతా ఇప్పుడు రివర్స్ అయ్యారు. ఆనం కూడా దాదాపుగా వెంకటగిరిని పట్టించుకోవడం మానేశారు. వచ్చేసారి ఆయన, ఆత్మకూరు నియోజకవర్గంనుంచి పోటీ చేసే ఆలోచనలో ఉండటంతో వెంకటగిరిలో ఏం జరుగుతున్నా పెద్దగా దృష్టి సారించడంలేదని తెలుస్తోంది. ఈ క్రమంలో వెంకటగిరిలో ఈరోజు పెద్ద కార్యక్రమం చేపట్టారు. నలుగురు సస్పెండైన ఎమ్మెల్యేల కటౌట్లు తయారు చేయించి, వాటిని కైవల్య నదిలో నిమజ్జనం చేశారు. ఆ నలుగురు ఎమ్మెల్యేలు పార్టీకి ద్రోహం చేశారంటూ మండిపడుతున్నారు ఉమ్మడి నెల్లూరు జిల్లా నేతలు. ఇప్పటికే ఉదయగిరిలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి శవయాత్రలు, దిష్టిబొమ్మల దహనం వంటి కార్యక్రమాలు జరిగాయి. ఇప్పుడు వెంకటగిరి నియోజకవర్గంలో నలుగురు ఎమ్మెల్యేల కటౌట్లను తయారు చేయించి వాటిని కైవల్యా నదిలో పడేశారు. వారికి పిండప్రదానం చేయాలని, దహన సంస్కారాలు చేయాలని అనుకున్నారు కానీ, చివరకు ఎమ్మెల్యేల కటౌట్ల ముందు టెంకాయలు, కర్పూరం ఉంచి, వాటిని నదిలో పడేశారు. శవయాత్రలో లాగా డప్పు కొట్టించారు. ఆనం రామనారాయణ రెడ్డితో అదే నియోజకవర్గంలో కలసి కార్యక్రమాల్లో పాల్గొని, జై కొట్టిన నేతలే, ఇప్పుడు ఆయన కటౌట్ ని కైవల్యానదిలో పడేయడం విశేషం. ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కటౌట్ ని మహిళలు నదిలో పడేశారు. నల్లజెండాలతో నిరసన తెలిపారు. వైసీపీ నాయకుడు కలిమిలి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో వినూత్న నిరసన జరిగింది. పార్టీకి వెన్నుపోటు పొడిచిన ఎమ్మెల్యేలకు పుట్టగతులు ఉండవని హెచ్చరించారాయన. అటు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిపై కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉదయగిరి నియోజకవర్గంలోని కొన్ని మండలాల్లో మేకపాటి శవయాత్రలు జరిగాయి, దిష్టిబొమ్మలు దహనం చేస్తున్నారు. మేకపాటికి వ్యతిరేక వర్గాలన్నీ ఏకమవుతున్నాయి. ఉదయగిరిలో ఆయన్ను అడుగు పెట్టనీయబోమంటూ ఆందోళనలు చేస్తున్నారు. అటు మేకపాటి కూడా ఉదయగిరి వెళ్లి హడావిడి చేసినా, ఆ తర్వాత అనారోగ్యం కారణంతో ఇంటికే పరిమితమయ్యారు. అటు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మాత్రం వ్యతిరేక గ్రూపులు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడంలేదు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పార్టీకి దూరం జరిగిన తర్వాత ఆయన గ్రూపులోని కొంతమంది ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డివైపు వెళ్లారు. కార్పొరేటర్లు కూడా కొంతమంది ఆదాల పక్కన చేరారు. మిగతావారు మాత్రం కోటంరెడ్డి వర్గంలోనే ఉన్నారు. ప్రస్తుతం కోటంరెడ్డి తమ్ముడు గిరిధర్ రెడ్డి టీడీపీలో చేరడంతో.. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి టీడీపీ టికెట్ ఖాయమని తేలిపోయింది. దీంతో కోటంరెడ్డి వర్గమంతా టీడీపీకి అనుబంధంగా ఉన్నారు. ఉదయగిరి, వెంకటగిరిలో మాత్రం వైసీపీ నాయకులు సస్పెండైన ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

# కిరణ్ కు లాభమా...నష్టమా

**తిరుపతి :**



ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి త్వరలోనే బీజేపీ పార్టీలో చేరతారని మాత్రం ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన చేరికతో పార్టీకి అదనంగా వచ్చే ప్రయోజనం ఏదైనా ఉంటుందా? అన్న చర్చ బీజేపీ జరుగుతుంది. కేవలం రెడ్డి సామాజిక వర్గాన్ని దగ్గరకు తీసుకోవడానికి నల్లారి దగ్గర దారి అనుకున్న కమల దళం ఆయనను పార్టీలోకి తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. కానీ రెండు రాష్ట్రాల్లో అది సాధ్యం అయ్యే పని కాదు. నల్లారి పదేళ్ల తర్వాత మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి దూకాలని చూస్తున్నారు. అయితే కిరణ్ కుమార్ ఏపీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. ఆ హోదాలో పని చేసిన వ్యక్తి మళ్లీ క్షేత్ర స్థాయి నుంచి రాజకీయం చేయాలంటే కష్టమేనని ప్రజలు చర్చించుకుంటున్నారు. మరో వైపు బీజేపీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదు. అలాంటప్పుడు కమలం కండువా కప్పుకోవడంతో కిరణ్ కు వచ్చే లాభమేమిటని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చేరికతో బీజేపీకి అంతగా లాభం ఉండబోదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి బాధ్యతలు నిర్వర్తించిన ఇమేజ్ ఓట్లుగా మలుస్తుందా ? అంటే నల్లారి గత పదేళ్లుగా ప్రజలకు ఎందుకు దూరమయ్యారన్న ప్రశ్న వెనువెంటనే వినిపిస్తోంది.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి స్వయంగా ప్రకాశించే నేత కాదు. ఆయన నాయకత్వ లక్షణాలు కేవలం ఒక్క నియోజకవర్గానికే పరిమితం అని చెప్పుకోవాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పైరవీల కాంగ్రెస్ లో ఆయన అదృష్టవశాత్తూ ముఖ్యమంత్రి అయ్యారు. నిజానికి అప్పుడు కూడా కిరణ్ ఎంపిక సరైంది కాదన్నది పార్టీలో అనేక మంది అభిప్రాయం. తన జీవితంలో చూడలేని పదవిని అనుభవించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రిగా పని చేసే అవకాశం కల్పించిన కాంగ్రెస్ ను కష్టాల్లో వదిలేసి వేరే పార్టీ చూసుకోవడంతోనే నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బలం బయటపడింది. ఆయన పీలేరు నియోజకవర్గానికి ఎక్కువ...చిత్తూరు జిల్లాకు తక్కువస్థాయి నేత అన్న సెటైర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో వినిపిస్తు న్నాయి.నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సేవలను తెలంగాణలోనూ బీజేపీ ఉపయోగించుకోవాలని భావిస్తుందట. అదే జరిగితే అంతకు మించి నష్టం మరొకటి ఉండదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఏపీ విభజన సమయంలో నల్లారి వ్యవహారాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరు. తెలంగాణలో ఆయన ఎంట్రీతో రెడ్డి సామాజికవర్గం ఓట్లను సంపాదిం చుకోవచ్చని బీజేపీ అధినాయకత్వం అంచనా వేసి ఉండవచ్చు. కానీ సాధ్యం కాదని, కాంగ్రెస్ చీఫ్ రేవంత్ రెడ్డి, వైఎస్సార్ టీపీ చీఫ్ వైఎస్ షర్మిల వైపు మాత్రమే తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గం మొగ్గ చూపుతుందని రాజకీయ ఉద్ధండుల మాట. కిరణ్ కుమార్ రెడ్డి.. వారి సామాజిక వర్గ నేతగా చూడటం లేదని అంటున్నారు. అలాంటప్పుడు అలాంటప్పుడు నల్లారితో బీజేపీకి కలిగే ప్రయోజనమేమిటనేది ప్రశ్నార్థకం.ఇక ఏపీలో నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి వల్ల బీజేపీకి అదనంగా వచ్చే ప్రయోజనం లేదు. ఇక్కడ రెడ్డి సామాజికవర్గం ఓట్లు జగన్ వైపు ఉన్నాయి. అవి టర్న్ అయి నల్లారి వైపు రావడం ఎట్టి పరిస్థితుల్లో ఇప్పుడు మాత్రం జరగదు. దీర్ఘకాలంలో చెప్పలేం కానీ ఇప్పటికిప్పుడు నల్లారి పార్టీలోకి వచ్చినా చేసేదేమీ లేదు. ఏపీలో బీజేపీకి అసలు ఓటు బ్యాంకే లేదు. నల్లారి వల్ల ఓట్లు పెరిగే అవకాశమూ ఎంత మాత్రం లేదు. ఎందుకంటే ఆయన లీడర్ కాదు. అధిష్టానం నిర్ణయించిన నాయ కుడు మాత్రమే. అందుకే ఆయన చేరిక బీజేపీకి రెండు రాష్ట్రాల్లో లాభం కాకపోగా, నష్టం జరిగే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని రాజకీయ పండితులు అంటున్నారు. సో.. నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి బీజేపీలోకి ఎంట్రీ రాంగ్ టైమింగేనన్నది పలువురి అభిప్రాయం.

# తెలంగాణ రాజకీయ పార్టీల వైపు

**విశాఖపట్టణం:**

విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు తమ స్వరాష్ట్రంలోని రాజకీయ పార్టీలపై నమ్మకం పోయింది. ఉండవల్లి అరుణ్ కుమార్ చెప్పినట్లు ఎవరు గెలిచినా ఆంధ్రప్రదేశ్‌లో అన్ని పార్లమెంటు స్థానాలు బీజేపీకే అన్నట్లు... దానికి అనుగుణంగానే వ్యవహరిస్తున్నాయి. దురదృష్టకరమేంటంటే ఏపీలో వైసీపీ, టీడీపీ తప్ప మరో పార్టీ గెలిచే పరిస్థితి గత రెండు ఎన్నికల్లో కన్పించలేదు. పార్లమెంటు స్థానాలతో పాటు శాసనసభలోనూ ఆ రెండు పార్టీలదే ఆధిపత్యం. అయితే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేస్తామని కేంద్ర ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నా ఏపీలోని రాజకీయ పార్టీలు మాత్రం నోరు మెదపడం లేదు. అధికార వైసీపీ, విపక్షంలో ఉన్న టీడీపీ, బీజేపీ?కి అలయన్స్‌తో ఉన్న జనసేన కూడా కార్మికుల గోడును పట్టించుకోవడం లేదు. ఏదో రాజకీయంగా అక్కడి గాజువాక స్థానంతో పాటు విశాఖ ఎంపీ పార్లమెంటు స్థానాన్ని గెలుచుకోవడానికి అప్పుడప్పుడు సెంటిమెంట్ ను తమ వైపునకు తిప్పుకోవడానికి తప్ప కేంద్ర ప్రభుత్వంపై ఎలాంటి వత్తిడికి రాజకీయ పార్టీలు దిగడం లేదు. అప్పుడప్పుడు ఆందోళనల్లో పాల్గొన్నా అది కేవలం రాజకీయం కోసమేనన్నట్లు వ్యవహరిస్తున్నాయి. దీంతో కార్మిక సంఘాలకు, కార్మికులకు విసుగెత్తుకొచ్చింది. సున్నితమైన అంశాన్ని కూడా ఏపీ రాజకీయ పార్టీలు పట్టించుకోక పోవడంతో విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు విసిగెత్తి పోయారు. కొన్ని వందల రోజుల నుంచి తాము విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరించవద్దంటూ ఆందోళన చేస్తున్నా ఏపీ రాజకీయ పార్టీలకు చీమకుట్టినట్లయినా లేదు. పైగా బీజేపీ పెద్దలతో వత్తాసు పలుకుతుండటం వారికి ఆగ్రహం కలిగించింది. దీంతో ఏపీ రాజకీయ పార్టీలపై విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులకు నమ్మకం పూర్తిగా కోల్పోయినట్లయింది. కమ్యునిస్టులు ఉన్నా పెద్దగా ప్రభావం చూపించలేని స్థితికి వెళ్లిపోయారు.. దీంతో కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచేందుకు వారంతా తెలంగాణలోని రాజకీయ పార్టీలను ఆశ్రయించారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీని ఆశ్రయించారు. దీంతో మంత్రి కేటీఆర్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించవద్దంటూ కేంద్ర ప్రభుత్వానికి ఘాటుగా లేఖ రాశారు. బీఆర్ఎస్ తో పాటు కాంగ్రెస్ పార్టీని కూడా వారు ఆశ్రయించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని కలిసి తమకు మద్దతివ్వాలని కోరారు.

## 10వ తరగతి పరీక్ష పేపర్ లీక్

**తాండూరు**

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఎంతో పకడ్బందీగా నిర్వహించవలసిన పదో తరగతి వార్షిక పరీక్షల పేపర్ వికారాబాద్ జిల్లా తాండూర్ వాట్సాప్ సోషల్ మీడియా గ్రూపులలో ముందే చెక్కర్లు కొట్టింది. ఉదయం 9:37కే వాట్సాప్ గ్రూప్ లలో వచ్చింది. ఈ విషయంపై అధికారులకు సమాచారం ఇచ్చిన పేపర్ మనది కాదని బుకాయించారు. మరోవైపు పరీక్ష సమయం అయిపోయిన తర్వాత 12 గంటల 30 నిమిషాలకు బయటకు వచ్చిన విద్యార్థుల దగ్గర పేపర్ చూడగా ఆ పేపర్ ఈ పేపర్ ఒకటే విధంగా ఉన్నట్టుగా తెలిసింది. దీంతో ముందుగానే పదో తరగతి పరీక్ష పేపర్ లీక్ అయిందని వెలుగులోకి రావడం జరిగింది. పేపర్ లీకేజీకి కారకులు ఎవరనేది విషయం విశ్వాసనీయ సమాచారం మేరకు తాను పట్టణం ప్రభుత్వ నెంబర్ వన్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బందెప్ప వాట్సాప్ గ్రూప్ లలో షేర్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం. తాండూర్ ఎంఈఓ వెంకటయ్య ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న పాఠశాలలోనే పదవ తరగతి పేపర్ లీకేజీ కావడం గమనార్హం.

## కేశవ్ కుమార్ కు గౌరవ సన్మానం



**హైదరాబాద్**

నెహ్రూ యువ కేంద్రం నిజామాబాద్ ఆద్వర్యంలో నిర్వహించిన యువ ఉత్సవ్ లో వివిధ అంశాలపై జరిగిన పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించినందుకు గాను ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కోర్టు ప్రధానన్యాయమూర్తి శ్రీమతి కుంచాల సునీత చేతుల మీదుగా ప్రముఖ సైకాలజిస్టు, సోషల్ వర్కర్ టి. కేశవ్ కుమార్ కు గౌరవ సన్మానం జరిగింది. ఈ కార్యక్రమం జిల్లా ఎన్వైకే యూత్ ఆఫీసర్ శైలీ ఆద్వర్యంలో జరిగాయి. ఇందులో తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ప్రొఫెసర్ డాక్టర్ రవీందర్ రెడ్డి,ఆల్ ఇండియా రేడియో పిఇఎక్స్ మోహన్ దాస్, ప్రొఫెసర్ డాక్టర్. త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్ష రాజకీయాలకు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గుడ్ బై

**అమరావతి**



వైసీపీ కీలక నేతల్లో ఒకరైన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు గుడ్ బై చెబుతున్నట్లు కీలక ప్రకటన చేశారు. చంద్రగిరి నుంచి తన కుమారుడు మోహిత్ రెడ్డి ఎమ్మెల్యేగా పోటీచేస్తారని స్వయంగా చెవిరెడ్డే ప్రకటించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఎవరూ ఊహించని రీతిలో తన కుమారుడ్ని అభ్యర్థిగా ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. కుమారుడు రాజకీయాల్లోకి వస్తున్నారు సరే.. నెక్ట్స్ చెవిరెడ్డి ఏం చేయబోతున్నారు..? ఈయనకు జగన్ ఏ బాధ్యతలు అప్పగిస్తారు..? రాజకీయంగా ప్రాధాన్యత ఉండే పదవి ఉంటుందా.. లేకుంటే మరేదైనా కీలక బాధ్యతలు..? ఉంటాయా..? అనేది ఇప్పుడు అటు చంద్రగిరి నియోజకవర్గంతో పాటు.. ఏపీ రాజకీయాల్లో చర్చ నడుస్తోంది.చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా కుమారుడ్ని ప్రకటించిన తర్వాత ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో చెవిరెడ్డి మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నా కుటుంబం కంటే ఎక్కువగా ప్రేమించే చంద్రగిరి ప్రజలకు కొంత దూరంగా వెళుతున్నందుకు బాధపడాలో, జననేత జగనన్న వంటి మనస్సు కలిగిన నేతకు దగ్గరవుతున్నందుకు సంతోష పడాలో తెలియట్లేదు. రాష్ట్ర స్థాయిలో పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణ బాధ్యతలు తీసుకోవాల్సి ఉన్నందున ముఖ్యమంత్రి జగనన్నకు అతి దగ్గరగా వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చింది. అందుకే ముఖ్యమంత్రి జగనన్న సూచన మేరకు మోహిత్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తున్నాను' అని చెవిరెడ్డి చెప్పుకొచ్చారు.

## రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దుపై వామపక్షాలు నిరసన..

**పత్తికొండ**

కుట్రతోనే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వమ్ రద్దు జరిగిందని, రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, టిడిపి నాయకులు, అశోక్ కుమార్, సిపిఎం నాయకులు దస్తగిరి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి క్రాంతి నాయుడు అన్నారు. సోమవారం పత్తికొండ పట్టణంలో కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నందు సిపిఐ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ నుంచి రాహుల్ గాంధీని రెండు సంవత్సరాలు డిస్మిస్ చేయడలో బిజెపి ప్రభుత్వం హస్తం ఉందని అన్నారు.

# సీఎమ్మార్ ఇవ్వని మిల్లులపై చర్యలు

**హైదరాబాద్ :**

సకాలంలో కస్టమ్ మిల్డ్ రైస్ ఇవ్వని డిఫాల్ట్ మిల్లర్లపై చర్యలు తీసుకొనేందుకు పౌరసరఫరాల సంస్థ సిద్ధమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా సీఎమ్మార్ ఇవ్వని 300 మిల్లుల జాబితాను అధికారులు సిద్ధం చేసినట్టు తెలిసింది. ఈ యాసంగి సీజన్‌లో ఆ మిల్లులకు ధాన్యం ఇవ్వకూడదని, ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఏప్రిల్ మూడో వారం నుంచి ప్రారంభించాలని పౌరసరఫరాల సంస్థ భావిస్తున్నట్టు తెలిసింది. మిల్లర్లు సకాలంలో సీఎమ్మార్ ఇవ్వకపోవడంతో అటు కేంద్రం, ఇటు ఎఫ్‌సీఐ వద్ద రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. కొందరు మిల్లర్లయితే ఏడాదిగా సీఎమ్మార్ ఇవ్వడం లేదు. ఇందుకు 2019-20 యాసంగి సీజన్ సీఎమ్మారే ఉదాహరణ. 118 మిల్లులు ఇప్పటి వరకు కూడా పౌరసరఫరాల సంస్థకు సీఎమ్మార్‌ను అందించలేదు. గడువు ముగిసి మూడేండ్లు గడుస్తున్నా.. ఆ మిల్లర్లు మాత్రం సీఎమ్మార్ ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో మిల్లర్ల ఆగడాలను ఇకపై ఉపేక్షించొద్దని పౌరసరఫరాల సంస్థ భావిస్తున్నట్టు తెలిసింది. డిఫాల్ట్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వొద్దని భావిస్తున్న పౌరసరఫరాల సంస్థ.. ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టింది. మొదటిది పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో మిడిల్ పాయింట్ గోదాములను ఏర్పాటు చేసి మిగిలిన ధాన్యాన్ని ఆ గోదాముల్లోకి తరలించాలని భావిస్తున్నది. రెండోది ఇప్పటి వరకు సీఎమ్మార్‌లో లేనటువంటి మిల్లులను ఇకపై తప్పనిసరిగా సీఎమ్మార్‌లోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. మిడిల్ పాయింట్ గోదాముల ఏర్పాటుపైనే అధికారులు ఎక్కువ దృష్టి పెట్టినట్టు సమాచారం. ఆయా జిల్లాల్లో పౌరసరాల సంస్థ అధికారులు ఇప్పటికే గోదాముల గుర్తింపు పనిలో పడినట్టు తెలిసింది.ప్రస్తుతం జిల్లాల్లో ధాన్యం కొనుగోలు, సీఎమ్మార్ ప్రక్రియ అంతా జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలో జరుగుతున్నది. దీనిపై జేసీలు సరిగ్గా దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో కొనుగోలు ప్రక్రియ నుంచి జేసీలను తప్పించి కలెక్టర్లకు అప్పగించేందుకు పౌరసరఫరాల సంస్థ ఆలోచన చేస్తున్నట్టు తెలిసింది. వీటన్నింటిపై ఏప్రిల్ 9 లేదా 10వ తేదీన కొనుగోళ్లపై జరిగే మంత్రుల సమావేశంలో నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉన్నది.

# తెలంగాణలో డిజిటల్ వాల్యుయేషన్

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఇంటర్ ప్రధాన పరీక్షలు మార్చి 29న ముగిసిన సంగతి తెలిసిందే. బ్రిడ్జి కోర్సు విద్యార్థులకు మాత్రం ఏప్రిల్ 4తో ముగియనున్నాయి. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,82,677 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం నుంచి 4,65,022 మంది విద్యార్థులు కలిపి మొత్తం 9,47,699 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఇప్పుడు విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఇప్పటికే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించింది. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు బోర్డు అధికారులు యత్నిస్తున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే మే మొదటి వారంలో ఇంటర్? ఫలితాలు వెలువడే అవకాశం ఉందని అధికారుల ద్వారా తెలుస్తోంది. ఈ సంవత్సరం స్టేట్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్.. సమాధాన పత్రాలను మూల్యాంకనం చేయడానికి ఒక వినూత్న పద్ధతిని ప్రవేశపెట్టింది. దాదాపు 35 లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడానికి ఆన్‌స్క్రీన్ డిజిటల్ మూల్యాంకన విధానాన్ని బోర్డు అమలు చేయనుంది. ఫలితాల ప్రక్రియను పకడ్బందీగా కొనసాగించేందుకు ఇంటర్ బోర్డు అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది.తెలంగాణలో జూనియర్ కళాశాలల అకడమిక్ ?క్యాలెండర్?ని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్? కళాశాలలు జూన్? 1న ప్రారంభమవుతాయిన బోర్డు అధికారులు ఏప్రిల్ 1న వెల్లడించారు. జూన్ 1 నుంచే తరగతులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ మేరకు 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన తాత్కాలిక విద్యా క్యాలెండర్ బోర్డు వెలువరించింది.ప్రకటించిన క్యాలెండర్ ప్రకారం.. జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 19 నుంచి 25 వరకు దసరా సెలవులు, 2024, జనవరి 13 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 16 వరకు సంక్రాంతి సెలవులు ఉండనున్నాయి. కాగా, ఇంటర్మీడియట్ విద్య కోసం ఈ ఏడాది మొత్తం 227 పని దినాలు ఉంటాయని బోర్డు తెలిపింది. ఇక ఫిబ్రవరి రెండో వారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. థియరీ పరీక్షలను మార్చి మొదటివారం నుంచి నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 నుంచి వేసవి సెలవులు ఇవ్వనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితయ సంవత్సరం వార్షిక పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఏపీలో ఇంటర్ పరీక్షలు మార్చి 15న ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 3తో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు, ఏప్రిల్ 4తో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇంటర్ ప్రశ్నపత్రాల మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ 1న ప్రారంభమైంది. మాచవరంలోని ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏప్రిల్ 1 నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం జరగుతోంది. ఇంగ్లిష్, హిందీ, తెలుగు, గణితం, సివిక్స్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. ఇంటర్ విద్యామండలి నుంచి ఉత్తర్వులు అందుకున్న అధ్యాపకులు విధిగా హాజరవ్వాలని రవికుమార్ ఇదివరకే ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రైవేటు యాజమాన్యాలు.. తమ అధ్యాపకులు విధులకు హాజరయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అధ్యాపకులను పంపని కళాశాలల గుర్తింపును రద్దు చేస్తామని ఆయన హెచ్చరించారు

# కేసీఆర్ ఇలాకాలోకి రేవంత్

**మెదక్ :**

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పాదయాత్ర మళ్లీ తిరిగి ప్రారంభం కానున్నది. ఈ నెల10న జుక్కల్ నుంచి హాథ్ సే హాథ్ పాదయాత్రను మొదలు పెట్టనున్నారు. కామారెడ్డి, నిజామాబాద్, మెదక్, సిద్ధిపేట్ జిల్లాలను సమన్వయం చేస్తూ ఈ పాదయాత్ర కొనసాగనున్నది. 25వ తేదీ వరకు ఈ పాదయాత్ర గజ్వేల్?సమీపంలోకి చేరుకుంటుంది. ఈ విడత సీనియర్లంతా హాజరు కావాలని స్వయంగా రేవంత్ రెడ్డి ఆహ్వానించినట్లు సమాచారం.పాదయాత్రలు జరుగుతున్న ప్రతి ముఖ్యమైన స్ట్రీట్?కార్నర్‌లో ఒక మీటింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. కార్యకర్తలు, పార్టీ ముఖ్య నాయకులకు భరోసా ఇచ్చేలా పాదయాత్రలో చర్యలు తీసుకోనున్నారు. ఇదిలా ఉండగా, ఇప్పటికే రేవంత్ ఉమ్మడి ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లోని ప్రధాన ఏరియాల్లో పాదయాత్రలను సమన్వయం చేశారు. ప్రజల నుంచి పాజిటివ్?సమీకరణాలు వస్తుండటంతో నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్దిపేట్ జిల్లాలు కలుపుకొని పాదయాత్ర చేయాలని రేవంత్ నిర్ణయించుకున్నారు.కాంగ్రెస్?పార్టీ సోమవారం నుంచి పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించింది. గాంధీభవన్ వేదికగా షురూ చేయనున్నారు. రాహుల్ అనర్హతపై పీఎం మోడీలకు లేఖలు రాయనున్నారు. టీపీసీసీ లీడర్లు, అనుబంధ సంఘాలన్నీ మోడీకి పోస్టు కార్డులు పంపనున్నారు. అదానీకి అనుకూలంగా ప్రధాని మోడీ తీసుకున్న నిర్ణయాల విషయంలో, రాహుల్?అనర్హత అంశాలపై మోడీకి పోస్టు ద్వారా కార్డులు పంపివ్వనున్నారు. దేశ వ్యాప్తంగా ఈ ఉద్యమం జరగనున్నది. కార్యకర్తలు, లీడర్లు, యువతతో పెద్ద ఎత్తున పోస్టు కార్డు ఉద్యమం చేపించాలని పార్టీ ముందుకు సాగుతున్నది.

# అర్బన్ నిజామాబాద్ కాంగ్రెస్ లో కాక

**నిజామాబాద్:**

తెలంగాణ కాంగ్రెస్‌లో జరిగిన తాజా పరిణామాలు నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాక రేపుతున్నాయి. ఈ నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సక్సెస్ కావడంతో.. ఆ సీటు మీద ఆశలు పెట్టుకున్నారట పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్. ఈ సారి అర్బన్ నాదేనంటూ కాంగ్రెస్ పెద్దలకు హింట్ కూడా ఇచ్చేశారట. కానీ.. పరిణామాలు ఊహించని విధంగా మారిపోయాయి. పీసీసీ మాజీ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ కుమారుడు, మాజీ మేయర్ సంజయ్ పార్టీలో చేరడంతో.. మహేష్ గౌడ్‌కు ఊపిరి సలపడంలేదట. అసలు జిల్లాకు చెందిన తనకు సమ్మతం లేకుండా ఆయన్ని పార్టీలో ఎలా చేర్చుకుంటారని పీసీసీ, ఏఐసీసీ పెద్దలను అడగడంతోపాటు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట మహేష్. డీఎస్ పార్టీలో చేరకుండా చివరి వరకు ప్రయత్నం చేశారట. ఐతే అదిష్టానం ఆదేశాలతో ఇక ఇష్టం లేకున్నా స్వాగతించారట. అంత వరకు సరే అనుకున్నా? సంజయ్ నిజామాబాద్ అర్బన్ టికెట్టు మీద కన్నేశారని జరుగుతున్న ప్రచారం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందట. తాను పోటీ లో ఉన్నానని అదిష్ఠానం పెద్దలకు ఒకవైపు గుర్తు చేస్తూనే? పార్టీలో చేరిన అందరికీ టిక్కెట్ హామీ ఉండదని ప్రచారం మొదలుపెట్టేశారట. ఆ విధంగా తాను రేసులోనే ఉన్నానని కేడర్‌కు సంకేతాలు పంపుతున్నారట మహేష్ గౌడ్.సీనియర్ లీడర్ డీఎస్‌కు, మహేష్ కుమార్ గౌడ్ కు మధ్య 2009 నుంచి రాజకీయ విబేధాలున్నాయి. డీఎస్ పీసీసీ అధ్యక్షునిగా ఉన్న సమయంలో..తాను రాజకీయంగా ఎదగకుండా అడ్డుపడ్డారని అసంతృప్తితో ఉన్నారట మహేష్ కుమార్ గౌడ్. జిల్లా పరిషత్ ఛైర్మన్ అవకాశం ఉన్నా జడ్పీటీసీ టికెట్టు రాకుండా, 2009 లో రూరల్ ఎమ్మెల్యే టికెట్టు రాకుండా అడ్డుపడ్డారట డీఎస్. అందుకే ఇద్దరి మధ్య గ్యాప్ పెరిగిందని చెప్పుకుంటున్నారు. ఇప్పటికీ ఆ గ్యాప్ కొనసాగుతూనే ఉంది. పార్టీ నుంచి డీఎస్ వెళ్లి పోయాక మళ్లీ రాకుండా మహేష్ గౌడ్ అధిష్ఠానానికి లేఖలు రాసి అడ్డుపడ్డారట. కొద్ది నెలల పాటు డీఎస్‌ను అడ్డుకోగలిగిన మహేష్ ఇప్పుడు ఆయన కుమారుడి చేరిక పై అసంతృప్తితో ఉన్నారట. డీఎస్ ఇటీవలే కాంగ్రెస్‌లో తిరిగి చేరి మరుసటి రోజే తూచ్? నాకు సంబంధం లేదంటూ రాజీనామా లేఖ ఇచ్చారు. అయినా ఆయన కుమారుడు సంజయ్ మాత్రం కొనసాగుతున్నారు. ఈసారి ఎన్ని ప్రయత్నాలు చేసినా? సంజయ్‌కి అర్బన్ టికెట్టు ఎలా వస్తుందో చూస్తానని తన సన్నిహితుల వద్ద చెబుతున్నారట మహేష్. దీంతో నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ లో ఇప్పుడు ఉన్న గ్రూపులకు తోడు మరో గ్రూపు వార్ మొదలైనట్ట యింది. అర్బన్ టికెట్టు ఆశిస్తున్న మహేష్ కుమార్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కేశ వేణు, మైనార్టీ నేత తాహేర్ బిన్ హందాన్ ఒక వర్గంగా తయారై? మనలో ఎవరికి టికెట్టు వచ్చినా ఓకే కానీ.. ఆయనకు మాత్రం రానివ్వకూడదని జట్టు కట్టారట.ఇటు సంజయ్ సైతం అర్బన్ సీటు పై కన్నేసి ఫోకస్ పెట్టేశారట. పార్టీలో చేరిక వివాదంగా మారడంతో ఏం చేయాలో తోచక ప్రస్తుతానికి సైలెన్స్ మోడ్ లోకి వెళ్లారట సంజయ్. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ లో అర్బన్ టికెట్టు పై రాజుకున్న వివాదం ఎటు వైపునకు దారితీస్తుందో చూడాలి. అసలే వంద రకాల సమస్యలతో సతమతమ అవుతున్న కాంగ్రెస్ పార్టీకి నిజామాబాద్ అర్బన్ రూపంలో మరో తలనొప్పి మొదలైంది. గ్రూప్ గొడవలు పీక్స్‌కు చేరుతున్నందున ఎవరికి టిక్కెట్ ఇస్తే.. ఎవరు సహకరించకుండా మొండికేస్తారోనన్న టెన్షన్ కూడా పార్టీ నాయకత్వంలో ఉందట.

# తెలంగాణలో కాంగ్రెస్, వైసీపీ అడుగులు...

**హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలపై తెలంగాణలో కాంగ్రెస్ తో కలిసిపోరాడేందుకు తెలంగాణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ షర్మిల రెడీ అవుతున్నారు. తెలంగాణలోని ప్రతిపక్షాలకు వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల లేఖ రాశారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాడేందుకు బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం, టీడీపీ, తెలంగాణ జనసమితి, జనసేన, బీఎస్పీ, సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీఎస్ లతో పాటు ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు తమతో కలిసి రావాలని లేఖలో కోరారు. నిరుద్యోగులకు న్యాయం జరగాలంటే ప్రతిపక్షాలంతా ఏకతాటి మీదకు రావాల్సిన అవసరం వచ్చిందన్నారు.. సర్కారుపై నిరుద్యోగ సైరన్ మోగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జెండాలు వేరైనా ఒకే అజెండాగా ఏకమైన పార్టీలు.. నేడు స్వరాష్ట్రంలో నిరుద్యోగ యువత కోసం మళ్లీ ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు షర్మిల. 1200మంది ఆత్మబలిదానాల మీద ఏర్పడిన తెలంగాణలో నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై పోరాడేందుకు తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్ అధ్యక్షులకు కాల్ చేశారు షర్మిల. రాష్ట్రంలో ఒకే వేదికను కలిసి పంచుకొని.. నిరుద్యోగ సమస్యను తీవ్రరూపం దాల్చుతామని చెప్పారు షర్మిల.నిరుద్యోగ సమస్యపై కలిసి పనిచేద్దామంటూ షర్మిల తమకు కాల్ చేశారని చెప్పారు టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి. అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో ప్రజలకు అన్యాయం చేస్తున్న పార్టీలతో తాము సమదూరమని.. అలాంటి పార్టీలతో షర్మిల చెప్పినట్లు కలిసి వేదిక పంచుకోలేమని చెప్పారు రేవంత్.వైఎస్ మరణం అనంతరం జరిగిన పరిణామాలతో కాంగ్రెస్ కు దూరమైంది వైఎస్ కుటుంబం. తన సోదరుడిపై కేసులు పెట్టించిన పార్టీతో అప్పుడు పాదయాత్ర ద్వారా ఫైట్ చేశారు షర్మిల. కాంగ్రెస్ పై దుమ్మెత్తిపోశారు. అవన్ని మరిచిపోయి వెనకటికి చెప్పినట్లు రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే సామేత మేరకు సోదరుడిపై కేసులు పెట్టించిన పార్టీతో సోదరి స్నేహ హస్తం అందిస్తారా? త్వరలో రెండు పార్టీలు కలిసి పోరాటాలకు ప్రణాళికలు రచిస్తాయా? రేవంత్ చెప్పినట్లు వీరి కలయికకు బీజేపీనీ అడ్డంకినా?. బీజేపీకి దూరం జరిగి.. షర్మిల ఒక్కరే ఫైట్ చేస్తే కాంగ్రెస్ సపోర్ట్ చేస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. ఏదీ ఏమైనా అటు షర్మిల, రేవంత్ స్టేట్మెంట్స్ రానున్న రోజుల్లో రెండు పార్టీల మధ్య అలయెన్స్ దారి తీస్తాయా? లేక నిరుద్యోగ సమస్య వరకే సరిపెడతాయో చూడాలి.

# ప్రతి వాహనదారుడు రోడ్ నియమ నిబంధనల మీద అవగాహన కలిగి ఉండాలి

## నెంబర్ ప్లేట్లు ట్యాంపరింగ్,హెల్మెట్ ధరించడం,త్రిబుల్ రైడింగ్,శబ్దకాలుష్యంలపై ప్రధాన దృష్టి-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**రాజన్న సిరిసిల్ల**



జిల్లా ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించి పోలీస్ వారికి సహకరించాలి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ రోడ్డు ప్రమాదాల నియంత్రణతో పాటు ట్రాఫిక్ నకు అంతరాయం కలుగడానికి కారణం అవుతున్న రోడ్డు నియమ నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు తీసుకునే పక్రియ నిరంతరం కొనసాగుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ అన్నారు.జిల్లా వ్యాప్తంగా మార్చ్ 26 నుండి ఏప్రిల్ 02 వరకు నిర్వహించిన ట్రాఫిక్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా వాహనదారులకు,ప్రజలకు ట్రాఫిక్ నియమాల మీద అవగాహన కల్పించి,ట్రాఫిక్ నియమాలు పాటించని వారి మీద కేసులు నమోదు చేయడం జరిగిదన్నారు.సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ ముందు జిల్లా ఎస్పీ,టౌన్ సి.ఐ,ట్రాఫిక్ ఎస్.ఐ లతో కలసి వాహనాల తనిఖీ నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డునియమనిబంధనలు పాటించకపోవడం వల్లనే ఎక్కువశాతం ప్రమాదాలు జరుగుతున్నాయని,ప్రతి వాహనాలు దారుడు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్,సీటు బెల్టు ధరించాలని,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని,మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని,వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను,ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖ వారికి సహకరించాలని కోరారు.వాహనాల నెంబర్లు కనిపించకుండా ఉండేందుకు రకరకాల పద్ధతులు కొనసాగిస్తుండటంతోపాటు వాహనాల నెంబర్లను ట్యాంపరింగ్ చేయడం,ట్రిపుల్ రైడింగ్,పెద్ద పెద్ద శబ్దాలు వచ్చేలా వాహనాలకు ఆదనపు సైలెన్స్ ర్లను బిగించి శబ్దకాలుష్యానికి కారణవుతున్న వాహనాలపై ప్రధాన దృష్టి కేంద్రీకరించి చర్యలు తీసుకోవడం జరుగుతుంది అన్నారు.వాహనాల ప్లేట్ నెంబర్లను ట్యాంపరింగ్ చేసి వాహనాలు నడిపేవారితోపాటు సదరు వాహనాలకు సంబంధించిన యజమానులపై కూడా క్రిమినల్ కేసులను నమోదుచేస్తామని హెచ్చరించారు.వివిధ రకాల వాహనాల క్రయవిక్రయాల సందర్భంగా సదరు వాహనదారులు తమపేరిట వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.విక్రయాల సందర్భంగా ఎలాంటి ధృవపత్రాలు ఏర్పాటు చేసుకోనట్లయితే కొనుగోలు చేసిన వాహనదారులు ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా వాహనాలను విక్రయించిన వారే ఇందుకు భాద్యులుగా భావిస్తూ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భాలలో తమపేరిట వాహనం రిజిస్ట్రేషన్ కలిగిఉన్నట్లైతే భీమాసౌకర్యం వర్తిస్తుందని, లేనట్లయితే క్రిమినల్ కేసులు నమోదుఅవుతాయనే విషయాన్ని గుర్తించాలని సూచించారు.ఆటో డ్రైవర్లు ఆటోలల్లో పరిమితి వరకే ప్రజలను ఎక్కించుకోవాలని పరిమితికి మించి ఎక్కించుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.గత వారం రోజుల్లో స్పెషల్ డ్రైవ్ లో జిల్లాలోని పరిధిలోని పోలీస్ స్టేషన్ లలో వాహనాలు తనిఖీ చేపట్టగా నెంబర్ ప్లేట్ లేని 458 వాహనాలు సీజ్ చేయడం తో పాటు నెంబర్ ప్లేట్ లేని 423 వాహనాలను గుర్తించి అక్కడికక్కడే నెంబర్ ప్లేట్ బిగించి పంపివ్వడం జరిగింది.మద్యం సేవించి వాహనాలు నడిపిన 219 మంది పై కేసులు నమోదు చేయడంతో పాటు హెల్మెట్ ధరించకుండా,రాంగ్ సైడ్ డ్రైవింగ్,డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడుపడం,సెల్ ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ మొదలగు ట్రాఫిక్ నియమాలు పాటించని 1754 వాహనాలపై స్పాట్ చాలన్స్ విధించడం,బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 28 మందిపై కేసులు నమోదు చేయడం జరిగింది.ఎస్పీ వెంట సిరిసిల్ల టౌన్ సి.ఐ అనిల్ కుమార్,ఎస్.ఐ లు శ్రీకాంత్, రాజు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉమ్మడి మెదక్ జిల్లాలో పదో తరగతి ఎగ్జామ్స్

**మెదక్**

ఉమ్మడి మెదక్ జిల్లాలో పదో తరగతి ఎగ్జామ్స్ ప్రారంభం అయ్యాయి. ఉదయం 9.30 గం. నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఐదు నిమిషాల నిబంధనతో ఎగ్జామ్ సెంటర్ లో ఉ.9.35 గం. వరకే విద్యార్థులకు అనుమతి నిస్తున్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ విధించారు. ఎగ్జామ్ సెంటర్ లొకేషన్ తెలుసుకోవడానికి సెంటర్ లోకేషన్ అనే యాప్ ని అధికారులు రూపొందించారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. సివిల్ డ్రెస్ లోనే పరీక్షకు హాజరు కావాలని విద్యార్థులకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. సిద్దిపేట జిల్లాలో 84 సెంటర్లలో 14, 193 మంది విద్యార్థులు, మెదక్ జిల్లాలో 10, 700 మంది విద్యార్థులు, సంగారెడ్డి జిల్లాలో 21, 389 మంది విద్యార్థులు రాస్తున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# రాజకీయంగా భవిష్యత్ కోసమే టీడీపీ పగ్గాలు..?

**హైదరాబాద్ :**

అవును... తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పెద్దగా లేదు. చచ్చిపోయింది అని చెప్పేకన్నా చంపేశారనే చెప్పాలి. 2014 తర్వాత కొంత పార్టీ ఇక్కడ కనిపించినట్లు అనిపించినా ఓటుకు నోటు కేసు తర్వాత చంద్రబాబు హడావిడిగా అమరావతికి బయలుదేరి వెళ్లారు. అప్పటి నుంచి తెలంగాణ పార్టీని పెద్దగా పట్టించుకోలేదు. గెలిచిన ఒకరిద్దరూ అధికార టీఆర్ఎస్ వైపు వెళుతున్నారు. 2014 లోనూ, 2018లోనూ అదే సీన్. అందుకే టీడీపీకి కొంత బలమున్న స్థానాల్లో మాత్రం అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. టీడీపీలో గెలిచినా తర్వాత ఏది అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి సునాయాసంగా వెళ్లే అవకాశముంది. అందుకే తెలంగాణ టీడీపీలో నేతలు పెద్దగా లేకపోయినా కొన్ని నియోజకవర్గాలకు మాత్రం అభ్యర్థులు ఎక్కువగానే కనిపిస్తారు. 2014 తర్వాత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకే పరిమితమయ్యారు. అక్కడ బలమైన వైసీపీ ఉండటంతో అక్కడే దృష్టి పెట్టారు. 2014లో అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇక్కడ పెద్దగా ఇరగదీసింది ఏమీ లేదు. ఏడాదికి ఒకటి రెండు సార్లు మాత్రమే ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు రావడం అలవాటుగా మార్చుకున్నారు. దీంతో ముఖ్యమైన నేతలు అందరూ పార్టీని వదిలి వెళ్లిపోయారు. పార్టీ నేతలు వెళ్లిపోతున్నా చంద్రబాబు పట్టించుకోవడం లేదు. చంద్రబాబు పిలిచి కూడా మాట్లాడే ప్రయత్నం చేయడం లేదు. దీంతో రేవంత్ రెడ్డి లాంటి నేతలు కూడా తమ దారి తాము చూసుకున్నారు. ఇక టీడీపీ ఇక్కడ బలోపేతమయ్యే అవకాశం లేదని భావించిన నేతలు వరసగా వెళ్లిపోయారు. ఇక మిగిలిన అరకొర నేతలు రాజకీయంగా ప్రజలకు దూరమయిన నేతలు మాత్రమే మిగిలారు. ఇక పార్టీ అధ్యక్ష పదవి చేపట్టిన వారు సయితం వెళ్లిపోవడం పార్టీలో చర్చనీయాంశమైంది. తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవిలో ఉంటే ముఖ్యమంత్రి కేసీఆర్ పిలిచి మరీ పదవి ఇస్తారన్న ఆశ కూడా వారిలో లేకపోలేదు. అలాగే గతంలో పార్టీ అధ్యక్షుడిగా ఉన్న ఎల్.రమణను పార్టీలోకి ఆహ్వానించి వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీని చేశారు. రేపు కూడా అంతేనన్న ఆలోచనలో పార్టీ అధ్యక్ష పదవిని తీసుకునేందుకు నేతలు ముందుకు వస్తున్నారు. కాసాని జ్ఞానేశ్వర్ కూడా ఈ కోవకు చెందిన నేతే. ఆయన తన రాకతో పార్టీ బలపడిపోతుందని రాలేదు. టీడీపీపై పిచ్చి అభిమానం అంతకంటే లేదు. ఏదో ఒక పదవి కావాలి. డబ్బు ఉంది. కులం ఉంది. దీంతో ఒక ముఖ్యమైన పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా మారితే రాజకీయంగా భవిష?యత్ ఉంటుందన్న అంచనాతోనే టీడీపీలో చేరి పార్టీ పగ్గాలు చేపట్టారు.రేపు ఎన్నికలయ్యేంత వరకూ కాసాని జ్ఞానేశ్వర్ ఆ పదవిలో ఉంటాడు. పార్టీ కార్యక్రమాలకు ఆయనే ఖర్చు చేస్తాడు. ఇటీవల జరిగిన 41వ ఆవిర్భావ సభను నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో నిర్వహించడానికి ఆయనే ఖర్చు పెట్టారంటున్నారు. ఖమ్మంలో జరిగిన సభకు కూడా బాగానే చేతిచమురు వదిలిందని చెబుతున్నారు. అయితే భవిష్యత్‌లో ఎల్. రమణ మాదిరిగా తనకూ అవకాశం రాకపోతుందా? అన్న ఎదురు చూపులతోనే పార్టీకి ఆయన ఖర్చుచేస్తున్నారు. భవిష్యత్ పెట్టుబడిగానే చూస్తున్నాడు. చంద్రబాబు కూడా ఏమీ లేనిచోట డబ్బులు పెట్టే వాళ్ల చేతిలో పార్టీని పెడితే ఎంతో కొంత ఉపయోగం ఉంటుందని భావించి మౌనంగా ఉన్నారు తప్పించి తెలంగాణలో టీడీపీ బలోపేతం అవుతుందన్న నమ్మకం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రెండు స్థానాలు దక్కించుకున్న టీడీపీకి, ఈసారి ఆ స్థానాలు కూడా రావడం కష్టమేనన్నది విశ్లేషకుల అంచనా.

# రామోజీరావు, శైలజా కిరణ్‌ను ప్రశ్నించిన సీఐడీ

**హైదరాబాద్**

మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అక్రమ వ్యవహారాలు జరిగాయంటూ సంస్థ యాజమాన్యానికి ఏపీ సీఐడీ కొద్ది రోజుల క్రితం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మార్గదర్శి ఛైర్మన్ రామోజీరావు, మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్‌ను ఏపీ సీఐడీ అధికారులు విచారణ చేస్తున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శైలజా కిరణ్ నివాసంలో శైలజతో పాటు, రామోజీరావును కూడా ఏపీ సీఐడీ అధికారులు ప్రశ్నించారు. చిట్‌ఫండ్ చట్టం నిబంధనలను ఉల్లంఘించి నిధులు మళ్లించారనే ఆరోపణలపై ఏ - 1గా రామోజీరావు, ఏ - 2గా శైలజా కిరణ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచీల మేనేజర్లపై సీఐడీ అధికారులు ఇప్పటికే కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే.మార్గదర్శిలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల కేసులో రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీరావుకు, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ శైలజాకిరణ్‌కు ఆంధ్రప్రదేశ్ సీఐడీ గత నెల 28న నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై విచారించాలని నోటీసుల్లో పేర్కొంది ఏపీ సీఐడీ. మార్చి 29, 31 లేదా ఏప్రిల్ 3, 6 తేదీల్లో ఎప్పుడైనా సీఐడీ విచారణకు రావాలని తెలిపారు. విచారణ వాళ్ల నివాసంలో కానీ, ఆఫీస్‌లో కానీ హాజరుకావాలని ఆదేశించారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ కేసులో ఏపీ సీఐడీ దూకుడుగా ఉంది. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ నిబంధనలు ఉల్లంఘించిందని కేసులు నమోదు చేసిన సీఐడీ ఇప్పుడు రామోజీరావు, శైలజకు నోటీసులు ఇవ్వడం, విచారణ చేస్తుండడం సంచలనంగా మారింది. ఇప్పటికే ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసింది వాళ్లంతా బెయిల్‌పై విడుదలయ్యారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాలు, మేనేజర్ల ఇళ్లపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ సోదాలు చేసింది. మార్గదర్శి సంస్థలో నిబంధలు ఉల్లంఘనలు బయటపడ్డాయని ఏపీ సీఐడీ కేసులు నమోదు చేసింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ నిబంధనలు ఉల్లంఘించిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కొంత కాలంగా మార్గదర్శి చిట్ ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. విచారణ సందర్భంగా మార్గదర్శి శాఖల్లో పనిచేస్తున్న కామినేని రామకృష్ణ (సీతమ్మధార), సత్తి రవిశంకర్ (రాజమండ్రి), శ్రీనివాసరావు(లబ్బీపేట), గౌరిజవోలు శివరామకృష్ణ(గుంటూరు)ను అరెస్టు చేసింది. తర్వాత వాళ్లకు కోర్టు బెయిల్ ఇచ్చింది. మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయన్న ఆరోపణలపై ఏపీ సీఐడీ కేసులు నమోదు చేసింది. ఇండివిడ్యువల్ గ్రూపులకు సంబంధించిన ఫారం 21ను మార్గదర్శి చిట్స్ సమర్పించలేదని, బ్యాలెన్స్‌షీట్లను తెలియజేసే పత్రాలను కూడా మార్గదర్శి అందజేయలేదని అధికారులు తెలిపారు. మూడు నెలలుగా మార్గదర్శికి చెందిన 444 గ్రూపులకు సంబంధించి కార్యకలాపాలను నిలిపివేశారని తెలిపారు. డిసెంబర్ నుంచి ఈ ఫారం నింపి ఇవ్వలేదంటున్నారు. మొత్తం మూడు చట్టాల కింద కేసులు నమోదు చేసింది సీఐడీ. ఐపీసీ సెక్షన్ 120(బి), 409, 420, 477(ఎ) , రెడ్ విత్ 34 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు అధికారులు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఇన్ ఫైనాన్షియల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ 1999 సెక్షన్ 5 ప్రకారం, అలాగే చిట్ ఫండ్ యాక్ట్ 1982 లోని సెక్షన్ 76,79 ప్రకారం ఈ ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లుగా సీఐడీ తెలిపింది. ఇందులో ఇన్వెస్టింగేటింగ్ అథారిటీగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉందని సీఐడీ ఓ ప్రకటనలో తెలిపింది. నమోదైన ఎఫ్ఐఆర్‌లలో ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు, మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్, అలాగే ఆ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ శైలజా కిరణ్, అలాగే ఆయా బ్రాంచీల మేనేజర్ల పేర్లను చేర్చారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్న విషయాన్ని సీఐడీ తన ప్రకటనలో తెలియచేయలేదు.

# ఖజానాకు ఆబ్కారీ శాఖే దిక్కు

**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్ర ఖజానాకు ఆబ్కారీ శాఖ పెద్ద దిక్కుగా నిలిచింది. వాణిజ్య పన్నుల శాఖ రికార్డు స్థాయిలో రూ.72 వేల కోట్ల ఆదాయం తెచ్చి పెట్టగా.. ఆబ్కారీ శాఖ రూ.31 వేల 560 కోట్ల రాబడితో సత్తా చాటింది. గతేడాది ఆర్థిక సంవత్సరంలో రూ.36 వేల కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. రికార్డు స్థాయిలో 42.99 కోట్ల లీటర్ల బీరు అమ్ముడుపోయింది. తెలంగాణ మందుబాబులు లిక్కర్ కంటే ఎక్కువగా బీర్లనే తాగేసినట్లు ఆబ్కారీ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో జరిగే మొత్తం మద్యం అమ్మకాల్లో 70 శాతం హైదరాబాద్, దాని పరిసర జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, నల్గొండ, మెదక్ జిల్లాల్లోనే జరుగుతుంది. ప్రధానంగా హైదరాబాద్ లో లక్షలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉండడం, భారీ ఎత్తున స్థిరాస్థి వ్యాపారం జరగడం, అంతర్జాతీయ స్థాయిలో పేరున్న ఫార్మా పరిశ్రమలు ఉండడం, పెద్ద సంఖ్యలో దేశ, విదేశాల నుంచి వివిధ వ్యాపార, పర్యాటక, విద్య, వైద్య అవసరాల కోసం రాకపోకలు సాగించే వారు ఉండడం వల్ల మద్యం అమ్మకాలు భారీగా ఉంటున్నాయని తెలుస్తోంది. దీనికితోడు కొవిడ్ నుంచి పూర్తిగా బయట పడడం, వర్క్ ఫ్రం హోం నుంచి ఉద్యోగులు దాదాపు బయటకు వచ్చి పని చేస్తుండడంతో బీరు అమ్మకాలు భారీగా పెరిగాయని అధికారులు అంచనా వేస్తున్నారు.అయితే తెలంగాణలో జరిగిన మొత్తం అమ్మకాల్లో అత్యధికంగ హైదరాబాద్ జిల్లాలో రూ.3739.42 కోట్లు, రంగారెడ్డి రూ.8410 కోట్లు, నల్గొండ రూ.3538 కోట్లు, మేడ్చల్ రూ.1326 కోట్లు, మెదక్ రూ.2917 కోట్లు, ఆదిలాబాద్ రూ.1438 కోట్లు, కరీంనగర్ రూ.2934 కోట్లు, ఖమ్మం రూ.2222 కోట్లు, మహబూబ్ నగర్ రూ.2488 కోట్లు, నిజామాబాద్ రూ.1652 కోట్లు, వరంగల్ రూ.3471 కోట్లు విలువైన మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వానికి వ్యాట్, ఎక్సైజ్ డ్యూటీ, మద్యం లైసెన్స్ ల ద్వారా ఆదాయం వస్తుంది. ఇప్పటి వరకు జరిగిన రూ.36 వేల కోట్ల విలువైన మద్యం అమ్మకాల లెక్కలను పరిగణలోకి తీసుకుంటే.. రాష్ట్రంలో ప్రతినెలా సగటున రూ.2 వేల 900 కోట్లకు పైగా విలువైన మద్యం అమ్ముడుపోతుంది. ఈ మద్యం విక్రయాల ద్వారా ప్రతి నెల.. రూ.1,150 కోట్ల నుంచి రూ.1,250 కోట్ల వ్యాట్.. ప్రతినెలా ఎక్సైజ్ డ్యూటీ ద్వారా రూ.1450 కోట్లు వస్తున్నాయి. సర్కారు ఖజానాకు సగటున నెలకు రూ.2,630 కోట్ల ఆదాయం వస్తున్నట్లు అధికారుల అంచనా. అంటే మొత్తం 12 నెలల్లో దాదాపు రూ.31 వేల 560 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలా రాష్ట్ర సర్కారును పెంచడంలో మందుబాబులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫుల్లుగా తాగుతూ.. సర్కారు ఖజానాకు మస్తు పైసల్ వచ్చేలా చేస్తున్నారు. ముఖ్యంగా పండుగలు, పబ్బాలు, చివరకు చావులు, బాధల్లోనైనా తెలంగాణలో మద్యం తాగడం మర్యాద చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే ఇంత ఎక్కువ స్థాయిలో ఆదాయం వస్తోందని అంతా అనుకుంటున్నారు.

# రైలు ప్రయాణికులపై పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తి

**కోజికోడ్**

కేరళలో దారుణ ఘటన జరిగింది. రైలు ప్రయాణంలో వివాదం తలెత్తడంతో ఆగ్రహించిన ఓ ప్రయాణికుడు తోటి ప్రయాణికురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో మహిళ సహా ముగ్గురు మరణించారు. రైలు బోగీకికూడా మంటలు వ్యాపించడంలో ప్రయాణికులు భయభ్రాంతులకు గురై చైన్ లాగి ట్రైన్‌ను నిలిపివేశారు. ఈ క్రమంలో నిందితుడు అక్కడినుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఈ ఘటనలో తొమ్మిది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిని చికిత్సనిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.ఆదివారం రాత్రి 9.50 గంటల ప్రాంతంలో కోజికోడ్ రైల్వే స్టేషన్ (ఉత్తరం) నుంచి అలపుజా-కన్నూరు ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. ఎలత్తూరు, కోయిలాండి రైల్వే స్టేషన్ల మధ్య కోరాపుజ రైల్వే వంతెన వద్దకు చేరుకున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రైలు బయలుదేరిన కొద్దిసేపటికే డి-1 కోచ్‌లో వివాదం తలెత్తి ఆగ్రహానికి గురైన గుర్తు తెలియని వ్యక్తి సహ ప్రయాణికులపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో ముగ్గురు మరణించారని పలువురికి గాయాల య్యాయని పోలీసులు తెలిపారు. అయితే ఈ ఘటనలో ఉగ్రవాద దాడికి సంబంధించిన ఆధారాలేవీ లేవని వెల్లడించారు.రైలు ఎక్కే సమయంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్టు తెలుస్తోంది. సీటు విషయంలో మహిళతో వ్యక్తి గొడవ పడ్డాడు. అయితే బోగీలోని కొందరు ప్రయాణికులు ఆమెకు మద్దతుగా నిలవడంతో ఆగ్రహంతో రెచ్చిపోయిన నిందితుడు.. తన వద్దఉన్న పెట్రోల్ బాటిల్ తీసుకొని మహిళా ప్రయాణికురాలిపై పోసి నిప్పంటించాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న ఓ చిన్నారి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో ముగ్గురూ మరణించారు. రైలు పట్టాలపై నుంచి పసిపాపతో సహా మూడు మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. మృతుల్లో ఇద్దరిని తౌఫిక్, రెహానాగా గుర్తించారు. మంటలు వ్యాపించడంతో కదులుతున్న రైలులో నుంచి వారు భయంతో దూకి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పట్టాల నుంచి మరో బాటిల్ పెట్రోల్, రెండు మొబైల్ ఫోన్‌లు ఉన్న బ్యాగ్‌ని స్వాధీనం చేసుకున్నారు .మంటలు బోగీకి వ్యాపించడంతో తీవ్ర ఆందోళనకు గురైన ప్రయాణీకులు చైన్ లాగి రైలును నిలిపివేశారు. ఈ క్రమంలో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో బోగీలోని తొమ్మిది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ సమాచారం అందుకున్న రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) బృందం ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసింది. ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.ఘటన అనంతరం కోరాపుజా నది వెంబడి ఉన్న వంతెనపై రైలు ఆగిన వెంటనే, ముప్పై ఏళ్ల వయస్సు గల వ్యక్తి దాని నుంచి దూకి తన కోసం వేచి ఉన్న బైక్‌పై పారిపోయాడని ప్రత్యక్ష సాక్షి తెలిపాడు. పరారైన నిందితుడు ఇతర వ్యక్తుల సహాయంతో బైక్‌పై వెళుతున్నట్టు సీసీ టీవీల్లో గుర్తించిన పోలీసులు ఆ ఫుటేజీని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పక్కా ప్రణాళికతో జరిగిన దాడిగా అనుమానిస్తున్నారు.గుర్తుతెలియని వ్యక్తి మండే స్వభావమున్న ద్రావణంతో ఉన్న బాటిల్‌ను తీసి సహ ప్రయాణికులపై చల్లాడని, వారు స్పందించేలోపే నిప్పంటించి పారిపోయాడని గాయపడిన వారిలో ఒకరు పోలీసులకు తెలిపారు. ఇదిలా ఉంటే ప్రమాద సమయంలో మహిళ, ఓ చిన్నారి కనిపించకుండా పోయినట్లు గాయపడిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మహిళ ఫోన్, చెప్పులను పోలీసులు గుర్తించారు.

# ఆరోపణలు 24 గంటల్లో నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా

**ధర్మవరం**



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా ధర్మవరం నియోజకవర్గంలో పర్యటిస్తున్నప్పుడు స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై విమర్శలు, ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అక్కడి ఎర్రగుట్ట ప్రాంతాన్ని ఆక్రమించి ఫాంహౌస్ కట్టుకున్నారని ఆరోపించారు. 'గుడ్ మార్నింగ్ ధర్మవరం' పేరుతో పట్టణంలో పర్యటిస్తూ.. అందరూ నిజాయతీగా ఉండాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి నీతులు చెబుతారని ఎద్దేవా చేశారు. కానీ, ఆయన మాత్రం గుట్టలను దోచేస్తున్నారని లోకేశ్ విమర్శించారు.అయితే, లోకేశ్ చేసిన ఈ విమర్శలపై ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. సోమవారం (ఏప్రిల్ 3) సీఎం జగన్ అధ్యక్షతన ప్రజా ప్రతినిధుల సమీక్షా సమావేశానికి హాజరు కావడానికి ముందు ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం సమీపంలో రోడ్డుపై ఆగి.. ఎమ్మెల్యే కేతిరెడ్డి ఫేస్ బుక్ లైవ్ చేశారు. తనపై చేసిన ఆరోపణలు 24 గంటల్లో నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తేల్చి చెప్పారు. నిరూపించలేకపోతే మీరు రాజకీయాల నుండి తప్పుకుంటారా? అని సవాలు విసిరారు. తాను కట్టించుకున్న ఫామ్ హౌస్ ఉన్న స్థలం మొత్తం రైతుల వద్ద నుంచి తాను కొనుక్కున్నానని చెప్పారు. చంద్రబాబు అక్రమంగా లింగమనేని నిర్మించిన ఫాంహౌస్‌లో నివాసం ఉంటున్నారని, అది క్రిష్ణా నది ఒడ్డున నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని ఆరోపించారు. చంద్రబాబు నివాసాన్ని చూపిస్తూ ఇది అక్రమ కట్టడం కాదా అంటూ ప్రశ్నించారు. "నేను రైతుల వద్ద భూములు కొనుగోలు చేసి ఇల్లు నిర్మించుకున్నా, చంద్రబాబులా రైతులను బెదిరించి నది వెంబడి భూములు లాక్కుని ఫామ్ హౌస్ లు నిర్మించలేదు" అని కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడారు."గుడ్ మార్నింగ్ ధర్మవరం పేరుతో నియోజకవర్గంలో తిరుగుతున్న ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఉద్యోగులకు నిజాయితీగా ఉండాలంటూ నీతులు చెబుతారు. అయితే తాను మాత్రం గుట్టలను దోచేస్తాడు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ధర్మవరం సమీపంలోని ఎర్రగుట్టను ఆక్రమించి విలాసవంతమైన ఫామ్ హౌస్ కట్టుకున్నారు. 902, 909 సర్వే నెంబర్లలోని 20 ఎకరాలను అక్రమించాడు. ఇది మరో రుషికొండ అని,ఎమ్మెల్యే గారి విలాస కార్యక్రమాలకు అడ్డా అని లోకల్ టాక్" అని నారా లోకేశ్ ట్వీట్ చేశారు.ఇప్పుడే కాదు, గతంలోనూ ఎమ్మెల్యే కేతిరెడ్డి నిర్మించుకున్న ఫామ్ హౌస్‌పై ఎన్నో ఆరోపణలు వచ్చాయి. టీడీపీ, బీజేపీ నేతలు ఆయనపై ఆరోపణలు చేశారు. ఆ సందర్భంలో కేతిరెడ్డి వాటిపై ఘాటుగా స్పందించేవారు. దమ్ముంటే ఆరోపణలు నిరూపించాలని సవాల్ విసిరారు. మొత్తానికి లోకేష్ కారణంగా.. ఇప్పుడు కేతిరెడ్డి ఫామ్ హౌస్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో కేతిరెడ్డి గుర్రపు స్వారీ చేస్తున్న ఫొటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఆయన చిన్నాన్న కేతిరెడ్డి పెద్దారెడ్డితో కలిసి బోటింగ్ చేసిన ఫొటోలు కూడా బయటకు వచ్చాయి. అయితే, ఆయనకు ఆహ్లాదకరమైన వాతావరణం అంటే ఇష్టమని, అందుకే ఎంతో ప్రేమతో ఫామ్ హౌస్ నిర్మించుకున్నారని కేతిరెడ్డి వర్గాలు చెబుతున్నారు.

# ఎమ్మెల్యే ద్వారంపూడి హయాంలో నగర అభివృద్ధి శూన్యం

**కాకినాడ,**




కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి గడిచిన నాలుగేళ్ల కాలంలో నగరంలో చేసిన అభివృద్ధి శూన్యమని తెలుగుదేశం పార్టీ కాకినాడ పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు సుంకర పావని పేర్కొన్నారు. ఈ నాలుగేళ్లలో ఎమ్మెల్యే ద్వారంపూడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులుతో ఎటువంటి అభివృద్ధి చేపట్టలేకపోయారని ఆమె విమర్శించారు. సోమవారం కాకినాడలోని జిల్లా టిడిపి కార్యాలయంలో ఆమె విలేకరులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నవరత్నాలలో భాగంగా మినహా మరెక్కడా రాష్ట్ర ఖజానా నుండి ఎటువంటి నిధులను తీసుకురాలేకపోవడం ఆయన విఫలం చెందారన్నారు. కాకినాడలో చిన్నారులకు ఎంతగానో ఉపయోగంగా ఉండే స్కేటింగ్ స్టేడియం, కాకినాడ కార్పొరేషన్ను కూల్చివేసి మొండి గోడలను అక్కడ మిగిల్చారన్నారు. కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన నిధులను ఇష్టాను సారంగా ఖర్చు చేయించి కార్పొరేషన్ను దివాలా తీయించారన్నారు. తమ టిడిపి ప్రభుత్వ హయాంలో టిట్కో గృహ సముదాయాన్ని నిర్మిస్తే అది నేటికీ కూడా 1200 మంది లబ్ధిదారులకు అందించడంలో ఎమ్మెల్యే ద్వారంపూడి విఫలం చెందారన్నారు. నగరంలో ఏ ఒక్క మంచి ప్రాజెక్టు పూర్తిచేశారో బహిర్గతం చేయాలని పావని డిమాండ్ చేశారు. కాకినాడ నగరంలోని జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ చెందిన ఖాతాదారుల భవిష్యత్తును అతను పట్టించుకోక పోవడంతో మరో ఇదే తరహా కార్తికేయ బిల్డింగ్ సొసైటీ కూడా దివాలా తీసే దశలో ఉందని ఆమె చెప్పారు. ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు ఏం ఉపయోగపడే పనులు చేశారు ఆమె చెప్పాలన్నారు. కాకినాడ నగరంలో పేద ప్రజలకు ఇల్లు ఇచ్చానని చెబుతున్న వైసీపీ నేతలు అది ఎక్కడ ఇచ్చారో ఆ ఇళ్లపై సంతృప్తి చెందామంటూ లబ్ధిదారులతో చెప్పించగలరా అని పావని ప్రశ్నించారు. కాకినాడ నగరంలో అన్యాయాలు, అక్రమాలు, భూకబ్జాలు, అరాచకాలు పెరిగిపోయాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చెత్త పన్ను నగర ప్రజల నుంచి పీడించి వసూలు చేసి పారిశుద్ధ్యం, దోమల నివారణపై ఎటువంటి చర్యలను ఎమ్మెల్యే ద్వారంపూడి చేపట్టలేక పోయారన్నారు. స్థానిక జగన్నాధపురం లోని ఎన్టీఆర్ వారధి కుంగిపోతే ఆ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురాకుండా కార్పోరేషన్ ఖజానా సొమ్మును నిధులను వినియోగించడం వల్ల కార్పొరేషన్ దివాలా తీసిందని దీనికి ఎమ్మెల్యే ద్వారంపూడి వైఖరియే కారణమని పావని చెప్పారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# అత్తగారింటి ఎదురుగా అల్లుడు ధర్నా

**నల్గొండ :**

అత్తారింటి వేధింపులతో కోడళ్ళు కానీ, ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు ధర్నా చేయడం ఇప్పటివరకు చూశాం. ఇక్కడ మాత్రం అల్లుడు అత్తారింటిముందు ధర్నా చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాడు. తన కన్న పేగును తనకు దూరం చేయ్యొద్దంటూ వేడుకుంటున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కోదాడకు చెందిన రమణి పృథ్వితో హైదరాబాద్ చెందిన ప్రవీణ్ కుమార్‌కు 2018 ఆగస్టులో వివాహమైంది. వీరి కాపురం అక్టోబర్ 2021 వరకు సజావుగానే సాగింది. వీరికి మూడేళ్ల కౌటిల్య కార్తికేయన్ అనే బాబు ఉన్నాడు. కానీ ఏమైందో తెలియదు కానీ భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. ఏడాదిన్నర క్రితం బాబుతో కోదాడలోని తన పుట్టింటికి రమణి పృథ్వి వచ్చేసింది.బాబుని కోదాడలో తల్లితండ్రుల వద్ద విడిచి రమణి పృథ్వి కెనడాకు వెళ్ళింది. దీంతో ప్రవీణ్ కుమార్ కూకట్ పల్లి ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. 9 నెలల క్రితం బాలుడిని తండ్రి ప్రవీణ్ కుమార్ ప్రతివారం కలిసేలా చూడాలని రమణి పృథ్వి తల్లిదండ్రులను ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. తన కొడుకును చూసేందుకు ప్రవీణ్ కుమార్ ఎన్నోసార్లు ప్రయత్నించినప్పటికీ అత్తమామలు అడ్డుకోవడంతో ఫలితం లేకపోయింది. దీంతో తన కొడుకును తనకు చూపించాలంటూ తల్లిదండ్రులతో కలిసి ఈ రోజు కోదాడలోని అత్తగారింటి ఎదుట ధర్నా చేశారు. మూడేళ్ల తన కొడుకుకు కోసం తీసుకున్న ఆట వస్తువులు ఇష్టమైన బొమ్మలతో నిరసన వ్యక్తం చేశాడు. ఏడాదిన్నరగా తన కొడుకుకు దూరంగా ఉండాల్సి వచ్చిందని ప్రవీణ్ వాపోతున్నాడు .కోర్టు ఆర్డర్‌ను రమణి పృథ్వి తల్లిదండ్రులు అమలు చేయకుండా తన కొడుకుని తనకు దూరం చేస్తున్నారని ప్రవీణ్ ఆరోపిస్తున్నాడు. కొడుకును చూపించకుండా అత్తమామలు అడ్డుకుంటున్నారని ఆరోపిం చాడు. పిల్లల మధ్య అభిప్రాయ భేదాలతో గొడవలు ప్రారంభమయ్యాయని ప్రవీణ్ తండ్రి చెబుతున్నారు. వీరి మధ్య ఉన్న అభిప్రాయ భేదాలను పరిష్కరించే ప్రయత్నం తన కోడలు తల్లిదండ్రులు ఏమాత్రం చేయలేదని ప్రవీణ్ తండ్రి చెబుతున్నారు. కోర్టు ఆదేశం ప్రకారం తమ మనమడిని తమకు చూపించకుండా అడ్డుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# గన్ లైసెన్సులపై అసత్య ప్రచారం చేసేవారిపై చర్యలు

**కడప :**



3: జిల్లాలో గన్ లైసెన్సులపై అవాస్తవాలు, అసత్య ప్రచారం చేసేవారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్.పి సోమవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 2014 నుండి 2019 సం. వరకూ జిల్లాలో 117 లైసెన్సులు మంజూరు చేయగా, 2019 సం. నుండి 2023 వరకూ 159 లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందని, ఇందులో 70 శాతం లైసెన్సులు ఏ.టి.ఎం ల క్యాష్ లోడింగ్ కు, ఇండస్ట్రియల్ సెక్యూరిటీ, బ్యాంకుల భద్రతలో భాగంగా ట్రైన్డ్ సెక్యూరిటీ గార్డ్స్ కు ఇచ్చినవేనని వెల్లడించారు. గత పదేళ్లలో మొత్తం 276 లైసెన్సులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అవాస్తవాలు ప్రచారం చేసేవారిపై లీగల్ ఒపీనియన్ తీసుకుని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అయన హెచ్చరించారు.

# శ్రద్ధతో పనిచేస్తే ఫలితం ఉంటుంది

## ప్రముఖ వాస్తు శాస్త్ర పండితులు నంబీ వేణుగోపాలాచార్య

**జగిత్యాల**





శ్రద్ధతో ఏపని చేసిన ఫలితం ఉంటుందని జగిత్యాలకు చెందిన ప్రముఖ జ్యోతి, వాస్తు శాస్త్ర పండితులు శ్రీమాన్ నంబీ వేణుగోపాలా చార్య కౌశిక అన్నారు.జగిత్యాల పట్టణంలోని గీతాభవన్ లో గీతాట్రస్ట్ వారి ఆధ్వర్యంలో గత 15 రోజులుగా మెట్పల్లికి చెందిన చీలమంతుల చత్రపతి గురుజీ చే ప్రారంభించబడిన 72వ భగవద్గీత పటణ శిక్షణ తరగతులు సోమవారంతో పండగ వాతావరణంలో ముగిశాయి. ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, పౌరాణిక పండితులు, శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక ముఖ్య అతిథిగా పాల్గొని మంగళ శాసనాలను అందించారు. ఈ సందర్బంగా వేణుగోపాలా చార్య అభిబాషణ చేస్తూ ఓం తత్ సత్ అనే పధం సంకల్ప వాక్యమని , గ్రంథ పటనం తర్వాతఎలాంటి దోషాలు ఉన్నా, క్షమించమని వేడుకొనేది వాక్యమని తెలిపారు. మానవాళికి తెలియని విషయాలు వేదాలలో దొరుకుతాయని, వేదంలో జ్ఞానం నిక్షిప్తమై ఉందన్నారు.శ్రద్ధ లేకుండా పనిచేస్తే ఫలితం ఉండదని, సత్సంగత్వం శ్రద్ధతో పని చేస్తే మోక్షం సిద్ధిస్తుందని శ్రీకృష్ణ పరమాత్మ చెప్పిన విషయాలను ఆయన క్షుణ్ణంగా విశదీకరించారు.భగవద్గీత పోటీలలో పాల్గొన్న మాతలు, పురుషులకు, బహుమతులు ప్రధానం చేశారు. 15 రోజుల పాటు సాగిన ఈ పఠన శిక్షణ తరగతులతో హిందూ భావం వెల్లివిరిసింది.అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గీతాభవన్ కార్యదర్శి పాంపట్టి రవీందర్, జీడిగే రాము,కోటగిరి చంద్రశేఖర్, చీల మంతుల పద్మావతమ్మ,ఛీల మంతుల శివరాం,ఎన్నాకుల ప్రభాకర్ ,కోటగిరి అశోక్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, మెట్పల్లి, కోరుట్ల, జగిత్యాలపట్టణాలకు చెందిన వందలాది మంది భక్తులు, సత్సంగ్ సభ్యులు పాల్గొన్నారు.

# హెచ్ఆర్సీ చైర్మన్, ఆర్టీఐ కమిషన్ లను నియమింపజేయాలి

**జగిత్యాల**

పదవీ విరమణలతో ఖాళీ అయిన తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్, సమాచార కమిషన్ లను వెంటనే నియమించాలని జాతీయ మానవ హక్కుల మండలి (స్వచ్ఛంద సంస్థ) పక్షాన ప్రతినిధులు రాష్ట్ర గవర్నర్ కు విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు సంస్థ ప్రతినిధులు రాష్ట్ర గవర్నర్ కు లేఖ రాశారు.తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, సమాచార హక్కు కమిషన్ లలోని చైర్మన్ లతో పాటు సభ్యులందరూ పదవీ విరమణ పొందడం వల్ల రెండు కమిషన్‌లు పూర్తిగా ఖాళీ ఏర్పడ్డాయని జాతీయ మానవ హక్కుల మండలి (స్వచ్ఛంద సంస్థ) రాష్ట్ర అధ్యక్షులు అయిల్నేని శ్రీనివాస్ రావు, సౌత్ జోన్ అధ్యక్షులు పి.గెల్వయ్య లు లిఖిత పూర్వకంగా రాష్ట్ర గవర్నర్ కు విన్నవించారు.రాజ్యాంగ సంస్థలైన రెండు కమిషన్ ల ఖాళీ వల్ల తెలంగాణ ప్రజలకు, నిరుపేదలకు, సామాన్యులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు.దీంతో గత కొంత కాలంగా రాష్ట్ర ప్రజలు, హక్కుల నేతలు, ఉద్యమకారులు తీవ్ర కష్టాలు - నష్టాలు, అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ రెండు కమిషన్లలో ఇప్పటికే వేల సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వారు తెలిపారు.నెలల తరబడి కొత్త కమిషన్ల నియామకం జరగకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

# రేషన్... గిరిజన బతుకుల్లో పరేషాన్

**అరకులోయ**



మండలంలోని శిరగం పంచాయతీ కోడిపుంజు వలస గ్రామానికి చెందిన ఐదు గిరిజన కుటుంబాలు సుమారు మూడు సంవత్సరాలుగా రేషన్ సరుకులు అందక నానా అవస్థలు పడుతున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాలు గా రేషన్ సరుకులు నిలిపి వేయడంతో అర్ధాకలితో పస్తులు ఉంటున్నామని ఉపాధి కూలీ లేక పిల్ల పాపలతో అలమటిస్తున్నామని వాపోయారు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ రేషన్ సరుకులు ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతున్న కేవలం అవి ప్రచారాల వరకే పరిమితమని గిరిజనులు ఆరోపిస్తున్నారు తమకు ఎలాంటి ప్రయోజనం లేదని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు రేషన్ కార్డులు ఉన్నాయని అయితే ప్రభుత్వం జారీ చేసిన రైస్ కార్డులు రాకపోవడంతో రేషన్ బియ్యాన్ని మధ్యలోనే నిలిపివేశారన్నారు గతంలో రేషన్ సరుకులు ఇచ్చేవారని ఇప్పుడు ఇతరాత్ర కారణాలు చూపి రేషన్ బియ్యాన్ని నిలిపివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని తెలిపారు తమకు ఇంతలా ఇబ్బందులకు గురి చేయడం ఎంతవరకు సమంజ సమని ప్రశ్నించారు సంబంధిత అధికారులకు తెలియజేసిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు పంచాయతీ వీఆర్వో ను వివరణ కోరగా నా దృష్టికి ఎప్పుడు రాలేదని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు వేడుకొంటున్నారు.

# వాడ్రాపల్లి లో ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్ మీటింగ్

**మునగపాక**

మునగపాక మండలం వాడ్రాపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో ముఖ్య ప్రముఖులుగా గ్రామ సర్పంచ్ అయిన కాండ్రేగుల నూకరాజు, , ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎరకయ్య, ఆడిట్ కు సంబంధించిన ఆఫీసర్లు, అగ్రికల్చర్ ఏవో పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఆర్జిఎస్ పనితీరు ఈ రెండు సంవత్సరాలు జరిగిన ఖర్చులు డెవలప్మెంట్ గురించి వాడ్రాపల్లి గ్రామంలో మీటింగ్ పెట్టి ప్రతి ఒక్కరికీ తెలియజేసారు. అలాగే తదనంతరం నూకరాజు మాట్లాడుతూ ఎన్ఆర్జీఎస్ పనులు ప్రారంభం కావడం జరిగింది. కనుక జాబ్ కార్డ్ ఉన్న ప్రతి ఒక్క కుటుంబం కూడా ఈ యొక్క పని ఆహార పథకం ద్వారా లబ్ధి పొందాలని అలాగే ఈ ఒక్క పనికి వెళ్లేటప్పుడు మాస్క తప్పనిసరిగా ధరించి పనికి వెళ్లాలని జాగ్రత్తలు పాటించాలని నూకరాజు తన మాటల ద్వారా తెలియజేయడం జరిగింది ఈ ఒక మీటింగ్ లో గ్రామ సెక్రటరీ శ్రీదేవి, 41సచివాలయం సిబ్బంది, గ్రామప్రజలు, వాలెంటరీలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు, డ్వాక్రా సీఏలు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

**హైదరాబాద్ :**



బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్ర ముస్లిం మైనారిటీ నేత సయ్యద్ అబ్దుల్ ఖదీర్ మౌలానా ఇతర ముఖ్య నేతలు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో కేసీఆర్ గులాబీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. సయ్యద్ అబ్దుల్ ఖదీర్ మౌలానా మహారాష్ట్రకు చెందిన ప్రముఖ నేత. ఎన్‌సిపి ఉపాధ్యక్షుడు. మహారాష్ట్రలోని ఔరంగబాద్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి 2019 సంవత్సరంలో ఎన్‌సిపి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. గతంలో ఎన్‌సిపి జాతీయ పార్టీ ఉపాధ్యక్షులుగా, మహారాష్ట్ర ఎన్‌సిపి మైనార్టీ అధ్యక్షులుగా పని చేశారు. ఎన్‌సీపీ మహారాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కూడా.మహారాష్ట్రకు చెందిన ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ప్రముఖ నేత కావడంతో సయ్యద్ అబ్దుల్ ఖదీర్ మౌలానా చేరిక ప్రాధాన్యత సంతరించుకుంది. మౌలానాకు ఔరంగాబాద్ జిల్లా ప్రాంతాల్లో రాజకీయ పట్టు ఉండటంతో రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మేలు చేకూరే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. మహారాష్ట్రకు చెందిన బీఆర్ఎస్ నేతలు, రైతు నాయకుడు మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా ధోంగే, వైజాపూర్ విధానసభ నియోజకవర్గ నాయకుడు అభయ్ పాటిల్, చిక్కగాంకర్ సాహెబ్, దళిత యువజన నాయకుడు ఏవీన్ష్ వస్మత్, ప్రహ్లాద్ రాఖోండే సాహెబ్, గోరఖ్ పాటిల్, శ్యామ్ కదమ్, గోవింద్ ధెంబారే, దేవానంద్ పాటిల్, తుకారాం సాల్వే, చంద్రవిలాస్ తొంబరే పాటిల్, గజానన్ కదమ్, సంతోష్ పాటిల్, యువనేత ప్రవీణ్ జెతెవాడ్ తదితరులు కూడా నేడు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు.

# రాజ్యంగ రక్షణ భేరీ ని విజయవంతం చేయాలి

**మదనపల్లె**

అన్ని వర్గాల ప్రజలకు రాజ్యాంగాన్ని దూరం చేసి మనుస్మృతిని తిరిగి రాజ్యాంగంగా తీసుకొచ్చే కుట్రను భగ్నం చేయడానికే రాజ్యాంగ రక్షణ రణ భేరి మహాసభను నిర్వహిస్తున్నామని విసికె పార్టీ రాష్ట్ర నాయకులు, భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటియం శివప్రసాద్ తెలియజేశారు. నేడు మదనపల్లె పట్టణంలోని ఓ ప్రయివేటు ఫన్షన్ హాలు నందు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రగతిశీల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ఉంటేనే మనందరికీ రక్షణ ఉంటుందని, అటువంటి రాజ్యాంగానికి నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కారణంగా ఉపద్రవం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఇటువంటి సభలు, సమావేశాలు అనేకం జరుగుతున్నాయని తెలిపారు. ఈ నెల 8వ తేదీన మదనపల్లె బిటి కళాశాల మైదానంలో జరిగే రాజ్యాంగ రక్షణ రణ భేరి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# టీడీపీ హాయంలోనే అభివృద్ధి

**మదనపల్లె**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కేవలం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోనే జరిగిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్చార్జి దొమ్మలపాటి రమేష్ పేర్కొన్నారు.అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు భవానీ ప్రసాద్, దొమ్మలపాటి యశ్వశ్వీరాజ్, సుధాకర్, మోడెంసిద్ధప్ప, వెంకటేష్, శ్రీనివాసులు, నర్సింహ, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే వైసిపి ప్రభుత్వంలో నిరుద్యోగం ఎన్నడూలేని విధంగా పెరిగిందన్నారు. నారా చంద్రబాబు నాయుడు పై అవినీతి ఆరోపణలు చేస్తున్న వైసిపి ప్రజాప్రతినిధులు అన్ని సాక్షాధారాలు ఉంటే ఈ నాలుగు సంవత్సరాల్లో ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

# మెకానిక్స్ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎంపిలు

**కాకినాడ**

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్కూటర్స్ ఑ మోటర్ సైకిల్స్ రిపేరింగ్ ఓనర్స్ అసోసియేషన్ కు భవనం నిర్మించిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎం.పి. వంగా గీతలు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాకినాడ రూరల్ స్కూటర్స్ ఑ మోటర్ సైకిల్స్ రిపేరింగ్ ఓవర్స్ అసోసియేషన్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి అసోసియేషన్ ప్రెసిడెంట్ చిరంజీవి అధ్యక్షత వహించగా కాకినాడ ఎం.పి. వంగా గీత ముఖ్యఅతిధిగాను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విశిష్ట అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాతనంగా నిర్మించిన స్కూటర్స్ అండ్ మోటర్ సైకిల్స్ రిపేరింగ్ ఓనర్స్ అసోసియేషన్ భవనాన్ని అతిధులు కురసాల కన్నబాబు, వంగా గీతలు రిబ్బన్ కత్తిరించి ప్రారంబించారు. ఈ సందర్భంగా అతిధులు ఎం.పి. గీత, ఎమ్మెల్యే కన్నబాబులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందే విదంగా సి.ఎం. జగన్ వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసారన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకుడు , పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పుల్ల చందు, సర్పవరం గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వర రావు, ఉపసర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, కాకినాడ రూరల్ జెడ్.పి.టి.సి. నురుకుర్తి రామకృష్ణ, కరప జెడ్.పి.టి.సి. యాళ్ళ సుబ్బారావు, కాకినాడరూరల్ ఎం.పి.పి. గోపిశెట్టి పద్మజా బాబ్జీ, ఎం.పి.టి.సి.లు సారా రాజేష్, కాకి సురేష్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కన్నారావు, వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు, సెక్రటరీ రామకృష్ణ, ట్రెజరర్ ఆంజనేయులు, అడ్వైజర్ వేణుగోపాలరావు జాయింట్ సెక్రటరీ రాము, లోవబాబు, మెంబర్ రమణ, పెద్ద సంఖ్యలో మెకానిక్స్ పాల్గొన్నారు.

# టీఎస్పీఎస్సీని బర్తరఫ్ చేయండి

**హైదరాబాద్**

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అంశం ఇప్పుడు రాష్ట్రపతి వరకూ వెళ్లింది. బీఎస్పీ తెలంగాణ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ టీఎస్పీఎస్సీ వ్యవహారంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. టీఎస్పీఎస్సీకి చెందిన పరీక్షా పేపర్ల లీకేజీ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించి సమగ్ర విచారణ జరిపించాలని లేఖ రాశారు. లీకేజీ వెనుక ముఖ్యమంత్రి లేదా మంత్రి కార్యాలయ ఉద్యోగుల పాత్ర ఉందేమో తేల్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత కమిషన్‌ను బర్తరఫ్ చేయాలని లేఖలో రాష్ట్రపతిని కోరారు."టీఎస్పీఎస్సీ కుంభకోణంలో తెలంగాణ సీఎంవో పాత్రను బహిర్గతం చేయడం కోసం సీబీఐ విచారణ, ప్రస్తుత కమిషన్‌ను బర్తరఫ్ చేయాలని కోరుతూ నేను రాసిన లేఖను మీతో షేర్ చేసుకుంటున్నా. మీరు కూడా ఇట్లనే భారత రాష్ట్రపతికి లేఖలు రాయగలరు" అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు.ూఖూఅ పై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు గగ్గోలు పెడుతుంటే, నమస్తే తెలంగాణ మాత్రం బీఆర్ఎస్ భజన చేస్తుంది. ఉద్యోగాలు భర్తీ చేయడం బీఆర్ఎస్ కు చేతకాదని తేలిపోయింది. బీఎస్పీ అధికారంలోకి రాగానే 10 లక్షల ఉద్యోగాలు సృష్టించి, పారదర్శకంగా భర్తీ చేస్తాం" అని మరో ట్వీట్ చేశారు.మరోవైపు, టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ అంశంలో ఈడీ రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేసు నమోదు చేశారు. పబ్లిక్ డొమైన్ లో ఉన్న ఆధారాలతో ఈడీ అధికారులు ఈ కేసు నమోదు చేశారు. పేపర్ లీక్ పై సిట్‌తో పాటుగా ఈ అంశంలో ఈడీ కూడా విచారణ చేయబోతుంది. ఎగ్జామ్ పేపర్స్ లీక్ స్కామ్‌లో హవాలా ద్వారా డబ్బుల లావాదేవీలు జరిగినట్లుగా ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే అరెస్టు అయిన 15 మందిని తిరిగి ఈడీ విచారణ చేయబోతున్నట్లు తెలుస్తోంది. అవసరమైన పక్షంలో టీఎస్పీఎస్సీ సభ్యులతో పాటు సెక్రెటరీని కూడా విచారించే అవకాశం ఉన్నట్లు సమాచారం.మొత్తానికి తెలంగాణలో ఈడీ దూకుడు పెంచుతోంది. రెండు ముఖ్యమైన కేసులపై ఈడీ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. మరోవైపు డాటా లీక్ పైన కూడా ఈడీ కేసు నమోదు చేసింది. ఈ విషయంలో బ్యాంకులతోపాటు పలు సంస్థలకు ఈడీ అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. ఈ?కామర్స్, ఐటీ కంపెనీలు వినియోగదారుల సమాచారంలో గోప్యత, భద్రత పాటించకపోవడం వల్లే డేటా లీకైనట్టు సైబరాబాద్ పోలీసులు నిర్ధారించారు. బిగ్ బాస్కెట్, ఫోన్ పే, ఫేస్‌బుక్, క్లబ్ మహీంద్రా, పాలసీ బజార్, అస్యూట్ గ్రూప్, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంకు, మాట్రిక్స్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంకు అఫ్ బరోడా సంస్థలకు సెక్షన్ 91 కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

# కాలువలో ముగ్గురు గల్లంతు

**శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం, నిమ్మాడలో విషాదం అలుముకుంది. వంశధార కాల్వలో స్నానానికి వెళ్లి ముగ్గురు మృతి చెందారు. మృతులు తండ్రీకొడుకులు నాగరాజ్ , తులసీరాజ్ , మరో వ్యక్తి వెంకటరమణగా గుర్తించారు. ఈ ముగ్గురు నిన్న రాజపురంలో వంశధార కాల్వలో స్నానానికి వెళ్లారు. వెళ్లినవారు తిరిగి రాకపోవడంతో వారి బంధులు, స్థానికులు ముగ్గురి ఆచూకి కోసం గాలింపుచర్యలు చేపట్టారు.రాత్రి నాగరాజ్ కుమారుడు తులసీరాజ్ మృత దేహం లభ్యమైంది. సోమవారం తెల్లవారుజామున నాగరాజు, వెంకటరమణ మృతదేహాలు కాలువలో తేలుతూ కనిపించాయి.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# రావణాసుర' చాలా ఎక్సయిటింగ్ థ్రిల్లర్



మాస్ మహారాజా రవితేజ మోస్ట్ ఎవైటెడ్ క్రైమ్ యాక్షన్ ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లర్ 'రావణాసుర'. సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్, ఆర్ టీ టీమ్ వర్క్స్‌పై అభిషేక్ నామా, రవితేజ గ్రాండ్ గా నిర్మించారు. హీరో సుశాంత్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం టీజర్, ట్రైలర్ తో ఇప్పటికే భారీ అంచనాలని నెలకొల్పింది. హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో ద్వయం సంగీతం అందించిన ఈ చిత్రంలోని పాటలన్నీ చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. ఏప్రిల్ 7న సమ్మర్ స్పెషల్ గా సినిమా రిలీజ్ కాబోతున్న నేపథ్యంలో సుశాంత్ రావణాసుర విశేషాలని విలేకరులు సమావేశంలో పంచుకున్నారు.

**'రావణాసుర' మీరా రవితేజ గారా ?**

'సుశాంత్ యాజ్ రామ్'ని రావణాసుర పోస్టర్ రిలీజ్ చేశారు. రావణాసుర టైటిల్ రోల్ రవితేజ గారు చేస్తున్నారు. ట్రైలర్ చూస్తే గ్రే షేడ్స్ అందరికీ వున్నాయి. 'హీరోస్ డోంట్ ఎగ్జిస్ట్' అనే ట్యాగ్ లైన్ వుంది. మరి ఇందులో రాముడు ఎవరో.. రావణాసురుడు ఎవరో సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. రావణాసుర చాలా ఎక్సయిటింగ్ థ్రిల్లర్. కొత్త ఎలిమెంట్స్ వున్నాయి. ట్రీట్ మెంట్ కొత్తగా వుంటుంది.

**మీరు థ్రిల్లర్ చేయడం ఇదే మొదటిసారి కదా**

అవును.. 'ఇచట వాహనములు నిలుపరాదు'లో కొంత థ్రిల్లర్ వుంటుంది. కానీ కంప్లీట్ థ్రిల్లర్ మాత్రం రావణాసురనే. ఇందులో కొత్తగా కనిపించే అవకాశం వచ్చింది. ఈ సినిమా చేయడానికి కారణం అదే. వెర్సటైల్ యాక్టర్ గా అన్ని రకాల పాత్రలు చేయాలనేది నా ఆలోచన. రావణాసురలో ఆ కొత్తదనం కనిపిస్తుంది.

**రావణాసుర కథ చెప్పినపుడు ఎలా అనిపించింది ?**

అభిషేక్ గారు ఫోన్ చేసినపుడు.. ఒక కథ రెడీ చేసి సినిమా చేయాలనే ఆలోచనలో వున్నాను. అభిషేక్ గారికి కూడా అదే చెప్పాను. కానీ కథ విన్నపుడు మాత్రం చాలా ఎక్సయిటింగా అనిపించింది. రవితేజ గారిని ఎప్పుడూ ఇలా చూడలేదు. ఒక ప్రేక్షకుడిగా నాకు చాలా కొత్తగా అనిపించింది. నా పాత్ర చాలా కీలకంగా వుంది. సినిమా అంతా వుంటుంది. దీనికి మరో డైమెన్షన్ తోడైతే బావుంటుదని చెప్పాను. సుధీర్ వర్మ గారికి కూడా అది నచ్చి చాలా ఫాస్ట్ గా వర్క్ చేసి నేను అనుకున్న దాని కంటే అద్భుతంగా ఆ డైమెన్షన్ ని తీసుకొచ్చారు. మరో లేయర్ యాడ్ అయ్యింది. రవితేజ గారికి కూడా ఇది చాలా నచ్చింది. నేను అనుకున్న దాని కంటే చాలా బాగా వచ్చింది.

**రవితేజ గారితో కాంబినేషన్ సీన్ల ఎలా వుంటాయి ?**

ఖచ్చితంగా థియేటర్లో చాలా ఆసక్తికరంగా వుంటాయి. రవితేజ గారిని కొత్తగా చూపించారు. నన్ను కొత్తగా చూపించారు. సీన్స్ అన్నీ ఇంట్రస్టింగా ఎక్సయిటింగ్ వుంటాయి.

**నిర్మాత అభిషేక్ గారి నిర్మాణంలో చేయడం ఎలా అనిపించింది ?**

అభిషేక్ గారితో గ్రేట్ జర్నీ. నిజానికి ఈ సినిమాలో ఈ పాత్రని నన్ను తీసుకోవాలనే ఆలోచన కూడా ఆయనిదే. ఈ సందర్భంగా అభిషేక్ గారి కృతజ్ఞతలు.

**ఇందులో మీ పాత్ర నుంచి ప్రేక్షకులు ఏం ఎక్స్ పెక్ట్ చేస్తారాని భావిస్తున్నారు ?**

ఎక్స్ పెక్ట్ కంటే ఎలా రిసీవ్ చేసుకుంటారనే ఎక్సయిట్ మెంట్ వుంది. చాలా డిఫరెంట్ మూవీ. ఇలాంటి కాన్సెప్ట్ తెలుగు సినిమాల్లో ఇప్పటివరకూ వినలేదు చూడలేదు. అందుకే కథ వినగానే ఓకే చేశాను. ప్రేక్షకులు కూడా ఈ కొత్తదనం ఫీలౌతారు.

**మీరు ఇండస్ట్రీ లోకి వచ్చి దాదాపు 15 సంవత్సరాలు అవున్నాయి ? అయితే సినిమాలు మాత్రం చాలా సెలెక్టివ్ గా.. గ్యాప్ తీసుకొని చేస్తున్నారని అనిపిస్తుంది?**

అక్కినేని కుటుంబం నుంచి రావడం నా అదృష్టం. అయితే నేను మొదటి నుంచి కూడా నాకు వస్తున్న అవకాశాలతోనే ముందుకు వెళ్లాను. కొన్ని సినిమాలు ఆలస్యం కావడం, అనుకున్న సమయానికి రాకపోవడం ..ఇలా నా చేతుల్లో లేనివి కూడా కొన్ని జరిగాయి. ఇంత గ్యాప్ ఎందుకు వస్తుందని కొన్ని సార్లు నాకే తెలియలేదు. అయితే ఇంత గ్యాప్ వచ్చిన నా మైండ్ లో ఎప్పుడూ నెక్స్ట్ సినిమా చేస్తున్నామనే స్ఫూర్తి వుండేది. చిలసౌ తర్వాత ఇక గ్యాప్ తీసుకోకూడదని అని బలంగా నిర్ణయించుకున్న తర్వాత కోవిడ్ వచ్చింది. దీంతో మళ్ళీ గ్యాప్ వచ్చింది. అయితే గత ఆరు నెలలుగా చాలా బిజీగా వున్నాను. సోలో హీరోగా ఒక కథ ఓకే చేశాను. ఇంకొన్ని కథలు వింటున్నా.

**'అల వైకుంఠపురములో' తర్వాత మీ కెరీర్ మరో మలుపు తీసుకుందని అనుకోవచ్చా ?**

'అల వైకుంఠపురములో' నాకు మంచి పేరు తీసుకొచ్చింది. నార్త్ లో కూడా ఫేం తీసుకొచ్చింది. అయితే ఈ సినిమా తర్వాత చాలా అవకాశాలు వచ్చాయి. అయితే నేను అన్నీ చేయలేదు. రావణాసుర, భోళా శంకర్.. ఇలా ఎక్సయిట్ చేసిన సినిమాలు మాత్రమే చేశా.

**కొత్తగా చేస్తున్న సినిమాలు**

సోలో హీరో గా ఈ ఏడాది ఒక సినిమా వుంటుంది. అలాగే మెగాస్టార్ చిరంజీవి గారితో 'భోళా శంకర్' సినిమా చేస్తున్నా.

# దసరా' మేము ఊహించిన దానికంటే పెద్ద బ్లాక్ బస్టర్ అయ్యింది

నేచురల్ స్టార్ నాని మాసియస్ట్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్ 'దసరా' మార్చి 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుంది. కీర్తి సురేష్ కథానాయికగా, నూతన దర్శకుడు శ్రీకాంత్ ఒదెల దర్శకత్వంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి భారీ ఎత్తున నిర్మించిన ఈ చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకులని నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. బాక్సాఫీసు వద్ద ప్రభంజనం సృష్టిస్తోన్న దసరా సక్సెస్ ఫుల్ గా దూసుకుపోతున్న సందర్భంగా హీరో నేచురల్ స్టార్ నాని విలేకరుల సమావేశంలో దసరా బ్లాక్ బస్టర్ విశేషాలని పంచుకున్నారు.

**దసరా విజయం ఎలా అనిపించిది ?**

సినిమా చూసిన వారంతా గొప్పగా స్పందిస్తున్నారు. విడుదలైనప్పటి నుంచి నా ఫోన్ మ్రోగుతూనే వుంది. మాట్లాడి చాలా కాలం అయిన వారు కూడా ఎమోషనల్ గా మెసేజ్ లు పెడుతుంటే.. దీని కోసమే సినిమా తీశాం కదా అనిపించిది. చాలా ఆనందంగా వుంది.

**దసరా లో చాలా ఎంజాయ్ చేస్తూ చేసిన సీన్లు ఏవి ?**

దసరా లొకేషన్ లో ఎంజాయ్ చేస్తూ చేసిన సీన్ ఏదీ లేదు. అన్నీ చాలా కష్టపడి చేసిన సీన్లే. దుమ్ము, ధూళి, వేడి మధ్య పని చేశాం. అయితే బాగా వస్తున్నాయని ఫీలింగ్ మాత్రం అన్ని సీన్లకి వుంది. థియేటర్ లో ఎలా వుంటుందో అని ఎక్సయిటెడ్ గా అనిపించింది మాత్రం దసరా క్లైమాక్స్. ప్రేక్షకులతో కలసి థియేటర్ లో చూడటానికి చాలా ఎక్సయిటెడ్ గా ఎదురుచూసాం. ఆన్ లైన్ ఎడిటింగ్ చూసినప్పుడే మేము షాక్ అయ్యాం. మీరు కంప్లీట్ రీరికార్డింగ్ తో చూసేసరికి ఆ ఇంపాక్ట్ ఇంకా పెరిగింది.

**రామ్ చరణ్ కు రంగస్థలం, అల్లు అర్జున్ కి పుష్ప.. మీకు దసరా అలా అని సోషల్ మీడియాలో మాట్లాడుకుంటారు.. ఈ సినిమా మీలో నటుడికి తృప్తిని ఇచ్చిందా?**

నటుడిగా నేను ఆనందపడతాను. కానీ తృప్తి పడను. ఎప్పుడు తృప్తి పొందుతామో ఇంకా ప్రయత్నం చేయడంలో అలసత్వం వచ్చేస్తుంది. ఈ సినిమాకే కాదు.. ఏ సినిమాకి తృప్తి పడను. ఆనందం మాత్రం వుంటుంది. దసరా తో టీం అందరికీ మంచి పేరు వచ్చింది. గ్రేట్ ఫీలింగ్.

**దసరా కథ విన్నప్పుడే దసరా కి ఇంత స్పాన్ వుందని అనుకున్నారా ?**

ఈ కథ విన్నప్పుడే ఇండస్ట్రీ లో బెస్ట్ టెక్నిషియన్స్ శ్రీకాంత్ కి ఇవ్వాలని డిసైడ్ అయ్యాను. సినిమా చేస్తున్నపుడే శ్రీకాంత్ చాలా పెద్ద డైరెక్టర్ అవుతాడని చెప్పాను. విడుదలకు ముందే చాలా ఈవెంట్స్ లో శ్రీకాంత్ పేరు గుర్తుపెట్టుకోండని చెప్పాను.

**మిగతా భాషలల్లో తీసుకురావాలని ఎప్పుడు నిర్ణయించారు ?**

కథ విన్నప్పుడే. ప్రేమ స్నేహం పగ యూనివర్సల్ గా కనెక్ట్ అయ్యే ఎమోషన్స్. మన కల్చర్ ని సెలబ్రేట్ చేసుకునే సినిమా ఏదైనా దొరికితే అది అందరి దగ్గరకి తీసుకెళ్లడం మన బాధ్యత. ఈ సినిమా చేస్తున్నపుడు బతుకమ్మ తో పాటు చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇలాంటి కథ వచ్చినపుడు ఇది మా కల్చర్ చెప్పడం మన బాధ్యత. దినిని అక్కడ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. కాంతారతో భూత్ కొళా అనేది కర్ణాటకలో వుందని దేశంలో అందరికీ తెలిసింది. ఇలా మన కల్చర్ ని చెప్పే అవకాశం వచ్చినపుడు దానిని అందరి దగ్గరికి తీసుకెళ్ళాలి.

**ఇప్పుడు మాస్ రస్టిక్ సినిమాలు నడుస్తున్నాయి కదా.. ఇలాంటి సినిమా కోసం ఇన్నాళ్ళు ఎదురుచూశారా ?**

నేను దేని కోసం ఎదురుచూడను. దసరా మాస్ సినిమా. పెద్ద బ్లాక్ బస్టర్. ఈ సినిమా విడుదలకు ముందే దాని నుంచి బయటికి వచ్చేశాను. ఇప్పుడు ఆరేళ్ళ పాపకి తండ్రిగా ఓ సినిమా చేస్తున్న . నేను ఏ బ్రాకెట్ లో పడకూదని భావిస్తాను. అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించేలా సినిమాలు చేయలనేది నా ఆలోచన. జెర్సీ ఫ్యాన్స్ వున్నారు.. ఇప్పుడు దసరా ఫ్యాన్స్ వున్నారు.. వాళ్లకి సినిమా వుండాలి, వీళ్ళకి సినిమా వుండాలి. నటుడిగా ఈ వైవిధ్యం వుండాలి.

దసరా కి నార్త్ నుంచి రెస్పాన్స్ ఎలా వుంది ?

చాలా అద్భుతంగా వుంది. చాలా గొప్ప రివ్యూలు వచ్చాయి. చూసిన వారంతా ఈ ఏడాది మా ఫేవరేట్ ఫిల్మ్ దసరా అని చెబుతున్నారు. మేము ఊహించినదాని కంటే అక్కడ ఎక్కువ రెస్పాన్స్ వస్తోంది. మేము ఊహించిన ఓపెనింగ్ వచ్చేసింది. దసరా కి వచ్చింది కొన్ని స్ట్రయిట్ హిందీ సినిమాలకి కూడా రాలేదు. రోజురోజుకి పెరుగుతోంది.

**మీ గత సినిమాల విజయాలకి మాస్ దసరా విజయానికి ఎలాంటి తేడా వుంది ?**

ఈ సినిమా విడుదలకు ముందు మీరు లవర్ బాయ్ కదా దసరా ఎలా వుంటుందని కొందరు అడిగారు. కానీ నా కెరీర్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ దసరా, ఎంసిఏ, నేను లోకల్. మూడు మాస్ సినిమాలు. నేను ప్రతిసారి ప్రూవ్ చేస్తూనే వున్నాను. నేను ఏది జోనర్ వారిగా చూడను. నచ్చితే చేసేస్తాను.

**మీకు కంఫర్ట్ ఫుల్ జోనర్ ?**

ఏ జోనర్ ని కూడా రిపీట్ చేయకపోవడాన్ని కంఫర్ట్ బుల్ గా ఫీలౌతా. చేసింది మళ్ళీ చేయకూడదు. మళ్ళీ రెండుమూడేళ్ళ తర్వాత సాలిడ్ మాస్ ఫిల్మ్ తో వస్తా. కానీ అలా చేయాలని కాదు. ఒక నటుడిగా కొత్తగా చేయాలని వుంటుంది. ఇది వర్క్ అవుట్ అవుతుందని అదే అమ్మాలని చూస్తే బిజినెస్ మెన్ అవుతాను కానీ యాక్టర్ ని కాదు కదా.

**దాదాపు గా 10 మంది దర్శకులని పరిచయం చేశారు.. ఒక ఇమేజ్ వచ్చిన తర్వాత సేఫ్ గేమ్ ఆడాలని వుంటుంది కదా ?**

సేఫ్ గేమ్ గొడవే మనకి లేదు ( నవ్వుతూ) కొత్త దర్శకులని పరిచయం చేయాలని ప్రత్యేకంగా ఏమీ అనుకోను. కథ నచ్చితే చేయాలనిపిస్తే చేస్తాను. అయితే సినిమాలు చేసిన అందరూ మంచి స్థానాల్లో వుండటం గర్వంగా వుంది.

**నాని.. బిగోర్ దసరా ఆఫ్టర్ దసరా అంటున్నారు ?**

ఇది నేను చాలా సార్లు విన్నాను.. భలే భలే మగాడివో, జెర్సీ, నిన్ను కోరి సినిమాలకి విన్నాను. ఇప్పుడు దసరాకి అంటున్నారు. ఇదే మాట నేను చేసిన ప్రతి సినిమాకి వినాలని నా కోరిక (నవ్వుతూ)

దసరా చూసిన తర్వాత జున్ను రియాక్షన్ ఏమిటి ?

ఫస్ట్ డే సుదర్శన్ కి వెళ్లాం. మా నాన్న కోసం ఎందుకు అందరూ ఇలా అరుస్తున్నారని వాడికి అర్థం కావడం లేదు. పేపర్లు విసిరేస్తుంటే పేపర్లు వేస్ట్ అయిపోతున్నాయని వాడి టెన్షన్. వాడికి ఇంకా ప్రపంచం తెలీదు.

**యుఎస్ లో 2 మిలియన్ కొట్టారు.. ఎలా అనిపించింది ?**

అక్కడి ఆడియన్స్ ప్రేమకు కృతజ్ఞతలు. నెంబర్స్ అలా వుంచితే సినిమా రాగానే చూడాలని ఫిక్స్ అవుతున్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకోగలిగితే చాలు.



**వీర్లపల్లి విలేజ్ గురించి ?**

దర్శకుడు శ్రీకాంత్ పెరిగిన ఊరు అది. వీర్లపల్లి వరల్డ్ చాలా క్లియర్ గా వుంది. అవినాష్ కొల్లా అద్భుతంగా సెట్ వేశారు. అది సెట్ లా వుండదు. నిజమైన ఊరులానే వుంటుంది.

**దసరా మీకు ఎలాంటి కాన్ఫిడెన్స్ ఇచ్చింది ?**

నాని మంచి సినిమాలు చేస్తాడని చాలా మంది బాక్సాఫీసు సినిమాలతో పోలికలు తెస్తారు. ఇక నుంచి ఈ కంపారిజన్లు ఆగిపోతాయి. ప్రతి సినిమా ఒక టార్గెట్ వుంటుంది. దాన్ని అర్థం చేసుకోవాలి. ప్రతి సినిమాని ప్రత్యేకంగా చూడాలి.

**ప్రభాస్, మహేష్.. గారు అందరూ దసరా ని మెచ్చుకుంటూ మెసేజ్ లు పెట్టడం ఎలా అనిపించింది ?**

చాలా ఆనందంగా వుంది. జెర్సీ, శ్యాం సింగ రాయ్ సమయంలో కూడా చరణ్ , తారక్ , ప్రభాస్ అన్న, మహేష్ గారు, చిరంజీవి గారు.. ఇలా అందరూ మెసేజ్ చేశారు. ఇది ఆనందంతో పాటు భాద్యతని కూడా పెంచుతుంది.

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950